Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 268 | హైదరాబాద్ | బుధవారం 12 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



# కోటి ఓట్లు ఏమయ్యాయి!

## ముగిసిన సర్ ప్రక్రియ.. భారీగా కోత పడే అవకాశం

### తిరిగి రాని ఫాంలే 75 వేలు.. మరణించిన.. డబుల్ ఓట్లు మినహాయింపు

### గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఎక్కువ

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో రాష్ట్రంలో భారీగా ఓట్లకు గండిపడనుంది. ఈ ప్రక్రియ సోమవారానికి ముగియగా, తెలంగాణ ఓటర్ల జాబితాలో కోటి ఓట్లు గల్లంతయ్యే అవకాశం కనిపిస్తోంది. సర్‌లో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన ముగియడంతో, లక్షలాది మంది ఓటర్ల వివరాలు లభ్యం కాకపోవడం లేదా అన్‌కలెక్టబుల్, నో మ్యాపింగ్ కేటగిరీల్లోకి చేరడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డబుల్ ఓట్లు, నివాసాలు మారిన వారు, మరణించిన వారితో పాటు సమాచారం అందించని వారి పేర్లను ఏరివేసే క్రమంలో ఏకంగా కోటి వరకు ఓట్లకు ముప్పు వాటిల్లే అవకాశం కనిపిస్తోంది.


(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో ఈ ప్రభావం అత్యధికంగా కనిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తుండగా, మిగిలిన గ్రామీణ, పట్టణ జిల్లాల్లో సైతం లక్షలాది మంది ఓటర్ల ఆచూకీ లభించలేదని అధికారులు నమోదు చేశారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇళ్లు మారడం, ఒకే కుటుంబ సభ్యులకు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటం, సరైన డోర్ నంబర్లు లేకపోవడం, బీఎల్ఓ ల సర్వే సమయంలో అందుబాటులో లేకపోవడమే ఈ భారీ వ్యత్యాసానికి ప్రధాన కారణాలుగా తేలుతున్నాయి. అధికారులు, పార్టీలు సైతం గ్రేటర్‌పై ఎక్కువ దృష్టి పెట్టినా ఫలితం మాత్రం అంతంతమాత్రంగానే వచ్చింది.

**వెనక్కి రాని ఫాంలు 75 లక్షలు**

సర్‌లో భాగంగా ఎన్యుమరేటర్లు ఓటర్లకు అందజేసిన మొత్తంగా 75 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు వెనక్కి

-2వ పేజీలో



# పొత్తు పొడవకుండానే!

## బీజేపీ.. జనసేన కలిపి పోటీ చేయవా?

- మోదీని ప్రశంసలతో ముంచెత్తుతున్న పవన్
- తెలంగాణలో ఒంటరి పోటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
- పొత్తు నిర్ణయం మీది కాదు : జనసేన

ప్రధాని నరేంద్రమోదీని జనసేన అధినేత ఎంతగా గుండెల్లో పెట్టుకుంటారో ఇటీవల ఏపీలోని బోగాపురం విమానాశ్రయం ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడిన మాటలే సాక్ష్యం. ప్రధాని మోదీ సైతం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను పొగడ్తలతో ముంచెత్తారు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

అవన్నీ ఏపీకే పరిమితమా? తెలంగాణలో బీజేపీ.. జనసేన పొత్తు పొడవకముందే నేతలు కత్తులు విసురుకుంటున్నారా? గత అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ఈ పార్టీలు వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎవరికి వారు బరిలో దిగుతారా అన్న చర్చ జరుగుతోంది. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. ఈ ప్రకటన తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఆంధ్రాలో కూటమిగా కలసి పనిచేస్తున్నప్పటికీ, తెలంగాణలో పొత్తుల ఆశలతో ఉన్న

-2వ పేజీలో



# పాతబస్తీ 'మెట్రో' వేగం పెంచండి

## మెట్రో టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి: సీఎం రేవంత్‌రెడ్డి


### పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పూర్తి చేయాలి

పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులును ఆదేశించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర చేపట్టనున్న మెట్రో కారిడార్‌కు సంబంధించి రహదారి విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజాతీర్పు)

ఈ మార్గంలో మెట్రో నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుత సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోలో రోజురోజుకూ ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. రైళ్లకు అదనపు బోగీలను జత చేసేందుకు అవసురమైన కోచ్‌ల కొనుగోలుపై చర్యలు చేపట్టులని ఆదేశించారు. ప్రయాణికులకు మెరుఋగెన సేవలు అందించేలా ముందస్తు ప్రణాళికుతో వ్యవహరించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌పై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్షించారు. అంతర్జాతీయ

-2వ పేజీలో



# ఈ గ్రంథాల రచనలో మీరు యజ్ఞం చేశారు

## డాక్టర్ వకుళాభరణంను అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ

### "బీసీల కోసం మీరు చేసిన కృషి గొప్పది" అంటూ ప్రశంస

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ప్రజాతీర్పు)

తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, రచయిత డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు తన సతీమణి శ్రీమతి సుధాశ్రీతో కలిసి మంగళవారం పార్లమెంట్ భవనంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో శ్రీ నరేంద్ర మోదీని కలిశారు. సుమారు పది నిమిషాలపాటు సాగిన భేటీలో తాను రచించిన 'శ్రీ నరేంద్ర మోదీ భారత్‌ను విశ్వవేదికపై నిలిపిన

-2వ పేజీలో



# సీఎం తమ్ముడి కంపెనీకి రూ. 200కోట్ల భూమి

## ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీకి రూ.7 కోట్లకే ఐదు ఎకరాలు కేటాయింపు

- టెస్సరాక్ట్ ఛైర్మన్‌గా సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి పేరు లింక్డ్ ఇన్‌లో
- మూలధనం రూ.లక్ష.. ఫోన్ నంబరు 123456 789గా పేర్కొన్నారు
- టెస్సరాక్ట్‌తో సీఎం సోదరుడికి సంబంధం లేదని మంత్రి చెప్పడం విడ్డూరం: కేటీఆర్

-2లో



# సగర్వంగా, వైభవోపేతంగా స్వాతంత్ర్య దినోత్సవం

## మంగళ్ మిలన్‌లో త్రివర్ణ పతాకంతో మోదీ, మంత్రులు, ఎంపీలు

### 'అభివృద్ధి చెందిన భారత్' కోసం ప్రతిజ్ఞ చేయాలి

### ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని సగర్వంగా, వైభవోపేతంగా నిర్వహిం చుకో వాలని మోదీ పేర్కొన్నారు. 'అభివృద్ధి చెందిన భారత్'కోసం ప్ర తిజ్ఞ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అధికార ఎన్డీయే కూట మి మంగళవారం నిర్వహించిన 'మంగళ్ మిలన్'కు మోదీ హాజర య్యారు.

-2లో




# ఆగని వాయిదాల పర్వం!

## రాహుల్‌కు వ్యతిరేకంగా ఎన్‌డీఏ ఎంపీల ఆందోళన

- విపక్షాల తీరుపై ప్రశ్నోత్తరాల సమయంలో స్పీకర్, ఛైర్మన్ అసంతృప్తి
- లోక్‌సభ, రాజ్యసభల్లో నినాదాల హోరు

-2లో

# సీఎం తమ్ముడి కంపెనీకి రూ. 200కోట్ల భూమి

హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజాతీర్పు)

సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి చెందిన టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీకి సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించడంపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒక్క ఉద్యోగి కూడా లేని, కేవలం రూ.లక్ష పెయిడ్ అప్ మూలధనం ఉన్న కంపెనీకి ఇంత విలువైన భూమిని ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ఈ వ్యవహారం రాష్ట్రంలోని అతిపెద్ద భూకేటాయింపు అక్రమాల్లో ఒకటిగా అనుమానిస్తున్నామని చెప్పారు. గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే లోకాయుక్త, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'టెస్సరాక్ట్ చైర్మన్ తానేనంటూ సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో పేర్కొన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో తమ సంస్థ పనిచేస్తున్నట్టు పేర్కొంటూ కొండల్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా కాన్సుల్ జనరల్ కూడా పాల్గొన్నారు. టెస్సరాక్ట్ చైర్మన్ హోదాలోనే యూఎస్ భారత వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక ఎగ్జిక్యూటివ్ బోర్డులో కొండల్‌రెడ్డి చేరినట్టు ఆ సంస్థ ప్రకటించింది. టెస్సరాక్ట్ కంపెనీ వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్ 123456789గా పేర్కొంటూ, 2025 మార్చి 31 నాటికి ఉద్యోగుల సంఖ్య సున్నాగా పేర్కొన్నారు. పటాన్‌చెరులోని ఓ చిన్న ఫ్లాట్‌ను టెస్సురాక్ట్ చిరునామాగా చూపుతున్నారు. గజానికి సుమారు రూ.3,700 చొప్పున ఐదు ఎకరాల భూమిని ఫ్యూచర్ సిటీలో రూ.7 కోట్లకు కేటాయించింది. రూ.200 కోట్ల విలువైన భూమిని తక్కువ ధరకు కేటాయించడం కుంభకోణం కాదా. టెస్సరాక్ట్‌కు, కొండల్‌రెడ్డికి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పడం విడ్డూరం. అమెరికాలో ఉన్న సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డికి చెందిన స్వచ్ఛ్ బయో సంస్థతో సుమారు రూ.1,000 కోట్ల ఎంఓయూను అమెరికా పర్యటన సందర్భంగా రేవంత్ కుదుర్చుకున్నాడు. మంత్రి శ్రీధర్‌బాబు శాఖలోనే ఈ నిర్ణయాలు జరిగితే ఆయనకు సమాచారం లేదా. టెస్సరాక్ట్‌కు భూ కేటాయింపు వ్యవహారంపై చివరి వరకు పోరాడతాం'అని కేటీఆర్ స్పష్టం చేశారు. 'కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని ఏపీ కోరుతోంది. ఇదే విషయాన్ని ఈ నెల 18న జరిగే గోదావరినది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) ఎజెండాలో చేర్చుడం సరికాదు. ఎజెండాలో ఈ అంశాలను తొలగించకుంటే తెలంగాణ ప్రభుత్వం ఈ సమావేశాన్ని బహిష్కరించాలి. లేదంటే జల ఉద్యమం చేపట్టి, అవసరమైతే జీఆర్ఎంబీ సమావేశం జరిగే జలసౌధను ముట్టడిస్తాం. సీఎం యా గాలు చేయడాన్ని మేము తప్పు పట్టడం లేదు. కానీ నీటిని ఒడిసి పట్టే పనులు చేయకుండా యాగాలు చేయడాన్నే మేము ప్రశ్నిస్తున్నాం'అని కేటీఆర్ స్పష్టం చేశారు.





# పొత్తు పొడవకుండానే!

(మొదటి పేజీ తరువాయి)

జనసేన శ్రేణులకు ఈ వ్యాఖ్యలు గుండెల్లో రాయిపడ్డట్టే అయ్యాయి. దీనిపై తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తక్షణమే స్పందిస్తూ.. పొత్తుల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది రామచందర్ రావు కాదని, ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఒకవేళ బీజేపీ రాబోయే రోజుల్లో ఒంటరిగానే వెళ్లాలని భావిస్తే, జనసేన కూడా తెలంగాణలో సొంతంగానే బరిలోకి దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు.

**రెండు పార్టీలకు ఇబ్బందే..**

గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. తెలంగాణలో బీజేపీ-జనసేన కలిసి పొత్తుతో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 8 స్థానాల్లో ఒక్కచోట కూడా బోణీ కొట్టలేకపోయింది. తాండూరు నుంచి పోటీ చేసిన శంకర్ గౌడ్‌తో సహా పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ద్వారా సాధించిన రికార్డు స్థాయి విజయం, పవన్ కళ్యాణ్‌కు పెరిగిన ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేన ఆశలపై.. బీజేపీ రాష్ట్ర నేతల ఒంటరి పోరు వ్యాఖ్యలు పెద్ద దెబ్బగానే భావించవచ్చు. అయితే, జనసేనను దూరం పెట్టి తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలనే వ్యూహం బీజేపీకి ఏమేరకు మేలు చేస్తుందనేది పెద్ద ప్రశ్నార్థకమే. తెలంగాణలో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి, అధికార కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పొత్తులు పెట్టుకుంటే పార్టీ స్వయం సమృద్ధి దెబ్బతింటుందని, ఇతర పార్టీల ఇమేజ్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని బీజేపీ భావిస్తోంది. కానీ, గ్రేటర్ హైదరాబాద్ , ఆంధ్రా సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నల్గొండ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అశేష అభిమాన గణాన్ని, ఆంధ్రా సెటిలర్ల ఓటు బ్యాంకును పూర్తిగా విస్మరించడం బీజేపీకి అంత సులభం కాదు. కాంగ్రెస్ బలమైన పోటీ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో ఓట్ల చీలిక బీజేపీకే నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.

**పెద్దల నిర్ణయమే ఫైనల్**

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది. ఇప్పుడు స్థానిక నేతలు ఎంతగా ఒంటరి పోరు అని చెబుతున్నా.. అసలు ఎన్నికల సమయం దగ్గరపడేసరికి కేంద్ర బీజేపీ పెద్దలు పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి పొత్తులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన ఉనికి కాపాడుకోవడానికి ఒంటరిగా పోటీ చేయక తప్పదు. ఏది ఏమైనా, అధిష్ఠానాలు ఇంకా పెదవి విప్పకముందే లోకల్ లీడర్లు చేస్తున్న ఇలాంటి ప్రకటనలు గ్రేటర్, తెలంగాణవ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులను గందరగోళంలో పడేశాయి.

# సోషల్ మీడియా పోస్టుల ఆధారంగానే కేటీఆర్ ఆరోపణలు

- బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకొనే కంపెనీలకు భూములిచ్చారా?
- వారి పాలనలో లీజు భూముల్ని క్రమబద్ధీకరించినప్పుడు కేటీఆర్‌కు తప్పనిపించలేదా?
- గత భూకేటాయింపులపై విచారణ చేయిస్తాం
- మీడియాతో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజాతీర్పు)

'దోపిడీ చేసింది మీరా, మేమా? మీ పాలనలో లీజు భూములను క్రమబద్ధీకరించారు. అప్పుడు తప్పనిపించలేదా?'అని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకేటాయింపులపై విచారణ చేయిస్తామని స్పష్టం చేశారు. సీఎం సోదరులకు భూకేటాయింపులు చేశారంటూ కేటీఆర్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శ్రీధర్‌బాబు మంగళవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ 'ఎవరో చెబితే పనిచేసే రకం కాదు నేను. నా శాఖలో జరిగే ప్రతి నిర్ణయమూ నాకు తెలుసు'అని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రూ. 90 లక్షలకు ఎకరం ఇస్తే తాము రూ. కోటిన్నరకు ఇచ్చామని తెలిపారు. బోర్డు నిర్ణయించిన ధర కంటే ఒక్క రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదన్నారు. 32 దరఖాస్తుల్లో టెస్సరాక్ట్ కంపెనీ ఒకటని వివరించారు. ఏ కంపెనీ ప్రారంభంలో అయినా పెట్టుబడి తక్కువ ఉంటుందని వెల్లుడించారు. టెస్సరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరులకు సంబంధం లేదని పునరుద్ఘాటించారు.

సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. 5 ఎకరాల్లో రూ. 34 కోట్లతో ఏర్పాటయ్యే కంపెనీని రూ.200 కోట్ల కంపెనీ అని కేటీఆర్ చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకొనే కంపెనీలకు భూములిచ్చారా అని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. గత ప్రభుత్వం తక్కువ ధరకు భూములు ఎందుకు ఇచ్చిందో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టెస్సరాక్ట్‌కు నిబంధనల ప్రకారమే భూకేటాయింపులు జరిగాయని.. దీనిపై ప్రతిపక్షాలు ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. పత్రికల్లో రాస్తారని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

పీఎం ఏక్తా మాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయని మంత్రి శ్రీధర్‌బాబు మరోసారి స్పష్టం చేశారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం మాల్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. రూ. 200 కోట్ల రుణం తిరిగి చెల్లించాల్సిందేనని తెలిపారు. ప్రీ బిడ్డింగ్‌లో ఏడుగురు బిల్డర్లు పాల్గొంటే ఇద్దరిని ఎంపిక చేశారని వివరించారు. పీఎం ఏక్తా మాల్ నిర్మాణంలో ప్రభుత్వంపై భారం లేకుండా లాభం జరుగుతుందని చెప్పారు. పరిశ్రమలు రావొద్దనే హిడెన్ ఎజెండాతో కేటీఆర్ ఇష్టారీతిన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నిరుపయోగంగా ఉన్న క్రమబద్ధీకరించిన భూములను హిల్ట్‌పీ ద్వారా బదలాయింపునకు ప్రయత్నం చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కలేనన్నారు. ఆ పార్టీపై కక్షతో ముందుకెళ్లే ఉద్దేశం ఉంటే కేటీఆర్ సహా ఇతరులంతా ఎక్కడో ఉండేవాళ్లని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు రెండున్నరేళ్లుగా దుష్ప్రచారం చేస్తున్నా, భయపెట్టినా పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు.

# ఆగని వాయిదాల పర్వం!

- జార్ఖండ్ ఘటనపై పరస్పర ఆరోపణలతో ఉద్రిక్త వాతావరణం
- పార్లమెంట్ ప్రాంగణంలో అధికార, విపక్ష కూటముల పోటాపోటీ నిరసనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ప్రజాతీర్పు)

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దాదాపు నినాదాల హోరులో కొట్టుకుపోయాయి. ఇప్పటిదాకా లోక్‌సభలో 11 బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవడం మినహా ఇతర కార్యక్రమాలేవీ సజావుగాసాగలేదు. రాజ్యసభలోనూ మంగళవారం ఇవే దృశ్యాలు పునరావృతమయ్యాయి. విద్యార్థులపై పోలీసుల దాడి అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇస్తారని ప్రభుత్వం పేర్కొన్నా, పెల్లెట్ గన్స్ వినియోగంపై ఆదేశాలు ఎవరిచ్చారో స్పష్టంచేయాలని, ఇతర డిమాండ్లపై చర్చ జరగాలన్న విపక్షాల పట్టుదలతో పెద్దగా ఎలాంటి సభాకార్యకలాపాలు జరగకుండానే లోక్‌సభ బుధవారానికి వాయిదాపడింది.

మంగళవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభంకాగానే ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష పార్టీల ఎంపీలు నిరసనకు దిగారు. అమిత్‌షా సభకు రావాలంటూ నినాదాలతో సభను అడ్డుకున్నారు. ప్రశ్నోత్తరాల సమయం ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టేందుకు అత్యంత ముఖ్యమైనదని స్పీకర్ ఓంబిర్లా అన్నారు. "సభ సవ్యంగా సాగకపోవడంతో నేనెంతో ఆవేదనకు గురవుతున్నా. సభలో ప్లకార్డులు ప్రదర్శించే సంస్కృతికి విపక్షసభ్యులు ఇకనైనా ముగింపు పలకాలి"అని అన్నారు. అయినాసరే సభలో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించడంపై స్పీకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు. సభ్యులు నినాదాలు, నిరసనలకంటే చర్చకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇరుపక్షాలు దీనిపై ఓ అవగాహనకు రావాలని కోరారు. అయినప్పటికీ అంతరాయాలు కొనసాగడంతో లోక్‌సభను వెంటనే మధ్యాహ్నం 2 గంటలకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా విపక్షాల నిరసనలు కొనసాగడంతో సభాధ్యక్షుడు సభను బుధవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల ప్రారంభంలోనే సభ్యుల నిరసనలతో కొంతసేపు గందరగోళం నెలకొంది. రాష్ట్రానికి సంబంధించిన అంశాలను సభలో ప్రస్తావించేందుకు అనుమతి లేదని చైర్మన్ స్పష్టం చేశారు. సభ్యులు తమ స్థానాల్లో కూర్చొని సభా కార్యక్రమాలను కొనసాగించేందుకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్‌నుద్దేశించి రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హోంమంత్రి ఒత్తిళ్లతో చైర్మన్ పనిచేస్తున్నారని అన్నారు. దీంతో చైర్మన్ స్పందించారు. "నాపై ఎవరి ఒత్తిడి లేదు. అందుకే ఎల్లప్పుడూ సభా మర్యాదలు, సభ్యుల బాధ్యతాయుతమైన వ్యవహారానికే ప్రాధాన్యం ఇస్తా'అని అన్నారు. ఈ సమయంలోనూ విపక్ష ఎంపీలు మరింత బిగ్గరగా నినాదాలు చేయడంతో మొదట మధ్యాహ్నం 12 గంటలకు తర్వాత 2 గంటలకు వాయిదా వేశారు. అనంతరం సభ వివిధ బిల్లులపై చర్చను కొనసాగించింది. ఇరుసభల్లో వాదించుకునే అధికార, విపక్ష కూటమి సభ్యులు వర్షాకాల సమావేశాల్లో తొలిసారిగా పార్లమెంట్ ప్రాంగణంలో పోటాపోటీ నిరసన ప్రదర్శనలతో బల ప్రదర్శనకు దిగారు. మకర ద్వారం ప్రాంతం ఇందుకు వేదికైంది. నీట్ లీకేజీ, అయోధ్య రామాలయంలో చందా చోరీ, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ ఘటనలను ప్రస్తావిస్తూ విపక్షాల 'ఇండియా'కూటమి పార్టీల ఎంపీలు నిరసన ప్రదర్శన చేపట్టారు. వీళ్లకు పోటీగా ఎన్‌డీఏ ఎంపీలు నిరసన ప్రదర్శన చేశారు. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ హయాంలో రాంచీలో పరీక్షార్థులపై లాఠీచార్జ్ చేశారని, ఈ ఘటనపై రాహుల్ గాంధీ ఎందుకు మౌనంవహిస్తున్నారంటూ అధికార కూటమి ఎంపీలు నిలదీశారు. సోరెన్ సర్కార్ వైఖరిని తప్పుబడుతూ నిరసన ప్రదర్శన చేశారు. జార్ఖండ్ ఘటనపై రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సమాధానం చెప్పాలని బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ముకేశ్ దలాల్ వద్దకు ప్రియాంకా గాంధీ వెళ్లి మాట్లాడే ప్రయత్నంచేశారు. జార్ఖండ్‌లో విద్యార్థులను రాహుల్ గాంధీ కలిశారని ప్రియాంక చెప్పగా, ముకేశ్ దలాల్ మాత్రం 'రాహుల్ గాంధీ జార్ఖండ్‌కు ఎప్పుడు వెళ్లారు?'అంటూ ప్రశ్నించారు. రాహుల్ ఇప్పటికే జార్ఖండ్ విద్యార్థులను కలిశారని ప్రియాంక స్పష్టంచేశారు. రాంచీలో విద్యార్థులను దారుణంగా కొట్టారని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇండియా కూటమి ఎంపీలు కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ప్రశ్నలు సంధిస్తూ నిరసనకు దిగారు. జార్ఖండ్ ఘటనతో పాటు పలు అంశాలపై కేంద్రం జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని కూడా కొందరు విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. రామమందిరం విరాళాలకు సంబంధించిన అంశాలను సైతం వారు ప్రస్తావిస్తూ ఆందోళనకు దిగడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఇరుపక్షాల ఎంపీల మధ్య తోపులాట వంటి ఘటనలు జరక్కుండా భద్రతాబలగాలు మధ్యలో నిలబడ్డాయి.



# సగర్వంగా, వైభవోపేతంగా స్వాతంత్ర్య దినోత్సవం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ప్రజాతీర్పు)

సమావేశ ప్రాంగణానికి మోదీ చేరుకున్నప్పుడు ఎన్డీయే ఎంపీలు, కేంద్ర మంత్రులు త్రివర్ణ పతాకాలు చేతబూని వందేమాతరం, భారత్ మాతా కీ జై అని నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. ఈ దృశ్యాలతో కూడిన వీడియోను మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేశారు. మన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులు అర్పిద్దామని, అభివృద్ధి చెందిన భారతదేశం కోసం ప్రతిజ్ఞ చేద్దామని సూచించారు. "హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా (ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం, ప్రతి హృదయంలో త్రివర్ణ పతాకం). అందరూ కలిసి రండి. ప్రతి ఇంట్లోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేద్దాం. భారత్ మాతా కీ జై, వందేమాతరం, వందేమాతరం, వందేమాతరం"అని మోదీ ఈ వీడియోలో పిలుపునిచ్చారు. అంతకుముందు పార్లమెంట్ భవన సముదాయంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో మంగళ్ మిలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి స్వయంగా జాతీయ జెండాను చేతబూనారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎస్.జైశంకర్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రతి మంగళవారం ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహిస్తున్నారు.

# కోటి ఓట్లు ఏమయ్యాయి!

(మొదటి పేజీ తరువాయి)

రాలేదు. మరో 60 లక్షలకుపైగా ఓటర్ల వివరాల్లో తేడాలున్నాయి. వీరిలో ఇరవై లక్షల వరకూ తేలిపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సేకరించిన సమాచారంలో లోపాలు ఉన్న వారిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తాత్కాలికంగా మినహాయించే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, నిజమైన ఓటర్లు కూడా ఈ రీ-వెరిఫికేషన్ ప్రక్రియలో భాగం కాకపోవడం వల్ల తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. పోలింగ్ కేంద్రాల మార్పు, చిరునామా సరిగ్గా మ్యాచ్ కాకపోవడంతో శాశ్వతంగా నివాసం ఉంటున్న సామాన్యుల ఓట్లు కూడా అనర్హుల జాబితాలోకి చేరడం పట్ల యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రంగంలోకి పార్టీల ఏజెంట్లు..**

రాష్ట్రంలో భారీగా ఓటర్ల సంఖ్య తగ్గడంతో పార్టీలు తమ ప్రతినిధులను రంగంలోకి దింపనున్నాయి. మళ్లీ ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని ఆదేశిస్తున్నాయి. ప్రస్తుతం ప్రచురిస్తున్న ముసాయిదా జాబితాల ఆధారంగా ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో తక్షణమే తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటు గల్లంతైనట్లయితే ఎన్నికల సంఘం కేటాయించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధిలో ఆన్‌లైన్ పోర్టల్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా నేరుగా బీఎల్ఓల ద్వారా ఫారమ్-6, ఫారమ్-8 దాఖలు చేసి రీ-ఇన్‌స్టేట్ చేసుకోవచ్చని వెల్లడించారు. రాజకీయ పార్టీలు కూడా క్షేత్రస్థాయిలో ఏజెంట్లను రంగంలోకి దింపి అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేలా చర్యలు వేగవంతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.

# ఈ గ్రంథాల రచనలో మీరు యజ్ఞం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

మహానాయకుడు' తెలుగుహిందీఇంగ్లీష్ త్రిభాషా గ్రంథం, 'అంత్యోదయం నుండి వికసిత భారత్' తెలుగు గ్రంథం, 'జీఎస్టీ: సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం మరియు వికాస యాత్ర' త్రిభాషా గ్రంథాలను ప్రధానమంత్రికి సమర్పించారు. గ్రంథాలను ఆసక్తిగా పరిశీలించిన ప్రధాని, "ఈ గ్రంథాల రచనలో మీరు యజ్ఞం చేశారు" అంటూ డాక్టర్ వకుళాభరణంను అభినందించారు. ఆయన వ్యక్తిగత వివరాలు, విద్యార్థి దశ నుండి బీసీ ఉద్యమాల్లో సాగించిన ప్రయాణం, బీసీ కమిషన్లలో సభ్యుడిగా, ఛైర్మన్‌గా అందించిన సేవలను అడిగి తెలుసుకున్నారు. "బీసీల కోసం మీరు చేసిన కృషి గొప్పది" అని ప్రశంసించారు. అత్యంత చిన్న సామాజిక వర్గం నుండి ప్రజాజీవితంలో డాక్టర్ వకుళాభరణం ఎదిగిన తీరును ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. "మీ నిబద్ధతను పరిశీలించాను; కలిసి పనిచేద్దాం" అని పేర్కొంటూ, రచనా పరంపరను కొనసాగించాలని సూచించినట్లు డాక్టర్ వకుళాభరణం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. 'జీఎస్టీ: సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం మరియు వికాస యాత్ర' గ్రంథాన్ని 2025 డిసెంబర్ 16న పార్లమెంట్ భవనంలో కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఆవిష్కరించగా, మిగిలిన రెండు గ్రంథాలను 2026 జూన్ 28న హైదరాబాద్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు శ్రీ నితిన్ నబిన్ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ అరుదైన అవకాశం ఇచ్చిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి, సహకరించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రామచందర్ రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి శ్రీ చంద్రశేఖర్ తివారీకి డాక్టర్ వకుళాభరణం కృతజ్ఞతలు తెలిపారు.

# పాతబస్తీ 'మెట్రో' వేగం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)



ప్రమాణాలతో సదస్సును నిర్వహించి తెలంగాణకు మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వివిధ వ్యాపార రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సదస్సులో సన్మానించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్‌వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



## అత్యవసర వేళ రక్తదానం.. 30వ సారి ప్రాణదాతగా హెచ్ఎంటీవీ రిపోర్టర్ శ్రీనివాస్

**కోరుట్ల ఆగస్టు 11 (ప్రజాతీర్పు)**

అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఓ మహిళ ప్రాణాలను కాపాడేందుకు తనవంతు సహాయం అందించారు హెచ్ఎంటీవీ కోరుట్ల నియోజకవర్గ న్యూస్ రిపోర్టర్, సామాజిక సేవకులు గుజ్జెటి శ్రీనివాస్. మెట్పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రుచిత అనే మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం బీ పాజిటివ్ రక్తం అవసరమైంది. రక్తదాత కోసం కుటుంబ సభ్యులు రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్‌ను సంప్రదించారు. దీంతో మెట్పల్లిలోని 'హెల్పింగ్ హాండ్స్' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గుజ్జెటి శ్రీనివాస్ వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి బీ పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. ఇది ఆయన చేసిన 30వ రక్తదానం కావడం విశేషం. విలేకరిగా విధులు నిర్వహిస్తూనే సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో 'హెల్పింగ్ హాండ్స్' స్వచ్ఛంద సంస్థను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిరుపేదలకు విద్య, వైద్య రంగాల్లో తనవంతు సహాయాన్ని అందిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసిన శ్రీనివాస్‌ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్, యువజన సంఘాల సభ్యులు, మీడియా మిత్రులు, రుచిత కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.



## ఎమ్మెల్యే గడ్డం వినోద్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా పండ్ల పంపిణీ

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 11**

మంచిర్యాల జిల్లా తాండూర్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి వివాహ వార్షికోత్సవం సందర్భంగా తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దబోయిన శంకర్ ఆర్.ఎం.పి,ఆధ్వర్యంలో తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఝాన్సీ రాణి సమక్షంలో రోగులకు పండ్లు, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేశారు. అనంతరం మదర్సా పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సలిగామ బానయ్య,హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మోమినాలి, జనరల్ సెక్రటరీ కటకాల మల్లేష్, సెక్రటరీ సాంబయ్య, మాదారం ఉపసర్పంచ్ దామోదర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కమాని శ్రీనివాస్, తాండూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ దుర్గం మహేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పున్నం గౌడ్, ఎం.డి. గౌస్, జావిద్, చీకటి వెంకటేష్ గౌడ్, తాళ్లపల్లి వెంకట్ గౌడ్, పుట్ట శీను, జీతుల వేణు, ఇందూరి సత్తయ్య, మాసాడి ప్రభాకర్, పెద్దబోయిన పప్పీ, పెద్దబోయిన రవి, కొల్లూరి ప్రకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- గార్ల సిహెచ్సి సూపరిండెంట్ గా డాక్టర్ కే నాగేశ్వరరావు
- సి,హెచ్,సి లో 5గురు నూతన వైద్యుల నియామకం
- ఆదేశించిన డి సి హెచ్ ఎస్ డాక్టర్ చింతా రమేష్

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి )ఆగస్టు 11**

గార్ల.. స్థానిక పట్టణ కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య ఆరోగ్య సిబ్బంది మండల ప్రజలకు సమయపాలన పాటిస్తూ పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని డి సి హెచ్ ఎస్ డాక్టర్ చింతా రమేష్ ఆదేశించారు. మంగళవారం స్థానిక సిహెచ్సి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి నూతనంగా విచ్చేసిన వైద్యులను పరిచయం గావించారు. డాక్టర్ కే నాగేశ్వరరావు జనరల్ సర్జన్ ఎంఎస్ సిహెచ్సి ఆసుపత్రికి నూతన మెడికల్ సూపరిండెంట్ గా నియామకమయ్యారు. గతంలో పనిచేసిన డాక్టర్ బాలు నాయక్ జనరల్ మెడిసిన్, డెంటల్ సర్జన్ డాక్టర్ అన్నపూర్ణ రెడ్డి, వీరితో పాటుగా అడిషనల్ గా నూతనంగా 5 గురు వైద్యులను సమీక్షలో పరిచయం చేశారు. డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి చిల్డ్రన్ స్పెషలిస్ట్. డాక్టర్ మౌనిక గైనకాలజిస్ట్. డాక్టర్ మనీషా అనిస్తీసియా. డాక్టర్ వైశాలి జిడిఎంఓ గా నియామకమయ్యారు. స్వాతి కుమార్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా, సీనియర్ అసిస్టెంట్ కిషోర్, నర్సింగ్ ఆఫీసర్స్ వి స్వాతి మెర్సీ ఝాన్సీ రాణి ఐ రాణి వినీల రజని పారామెడికల్ సిబ్బంది అశోక్ మాధవి బైరపాక శ్రీనివాస్ పర్వీన్ నరసయ్య తిరుమలరావు నరేష్ తదితరులు పాల్గొనగా, నూతనంగా నియామకమైన ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ నాగేశ్వరరావును ఆరోగ్య సిబ్బంది శాలువాతో సన్మానించారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్.

**(పాషా సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) ఆగస్టు 11**



జిల్లాలో ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ మహేష్ బి గితె తో కలిసి సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, తప్పనిసరిగా హాజరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లు, వేదిక, గ్రౌండ్ తదితర ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అవగాహన కలిగే విధంగా స్టాళ్లలో ప్రదర్శించాలని సూచించారు. దేశభక్తిని ప్రతిబింబించేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసేందుకు సంబంధించిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథి ప్రసంగం కోసం జిల్లాలోని వివిధ శాఖలు చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంక్షిప్త నివేదికలను జిల్లా పౌర సంబంధాల అధికారికి అందజేయాలని ఆదేశించారు. జిల్లాకు చెందిన ప్రముఖులు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులు వేడుకలకు హాజరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ కార్యాలయాల్లో కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించడంతో పాటు జిల్లా స్థాయి వేడుకలకు అధికారులు, సిబ్బంది హాజరయ్యేలా చూడాలని తెలిపారు. వేడుకల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, విద్యార్థులకు అవసరమైన మేర తాగునీటి వసతి ఏర్పాట్లు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల పోలీస్‌స్టేషన్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

- కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి : ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్

**కోరుట్ల ఆగస్టు 11 (ప్రజాతీర్పు)**



కోరుట్ల పోలీస్‌స్టేషన్‌ను జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, ప్రతి కేసులో నిబంధనల ప్రకారం సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, వివిధ రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని సూచించారు. బీట్ వ్యవస్థ, రాత్రి గస్తీ, నేర నియంత్రణ చర్యలను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, ఓటీపీ మోసాలు, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్‌లపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. మైనర్ల వాహన వినియోగం, ప్రమాదకర డ్రైవింగ్, మోడిఫైడ్ సైలెన్సర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాములు, ఎస్ఐలు శ్యామ్‌రాజ్, గంగాధర్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## సాయిని మల్లేశంకు హుస్నాబాద్ బార్ సోసియేషన్ ఘన సన్మానం

**హుస్నాబాద్, ఆగస్టు 11 రవీందర్ ప్రజా తీర్పు**

బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన న్యాయవాది సాయిని మల్లేశంను హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్‌గా, విశ్వహిందూ పరిషత్‌తో పాటు బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పార్టీకి అంకితభావంతో సేవలందించిన మల్లేశంకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం సంతోషకరమని బార్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయం (చలి గల్)లో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 11.**



జగిత్యాల జిల్లా కేంద్రీయ విద్యాలయ చెల్గల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది ఎంపిక ప్యానెల్ తయారీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలవాటిక ఉపాధ్యాయులు, ప్రాథమిక ఉపాధ్యాయులు పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థులు 24.08.2026న వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అలాగే కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పెషల్ ఎడ్యుకేటర్, సంగీతం/నృత్య శిక్షకులు పోస్టుల కోసం 25.08.2026న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత విద్యార్హతలు, ధ్రువపత్రాలతో నిర్ణీత తేదీల్లో కేంద్రీయ విద్యాలయ చెల్గల్‌కు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఇంటర్వ్యూలకు సంబంధించిన అర్హతలు, ఖాళీలు, సమయాలు, అవసరమైన ధ్రువపత్రాలు తదితర పూర్తి వివరాల కోసం కేంద్రీయ విద్యాలయ చెల్గల్‌ను సంప్రదించడంతో పాటు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలిపారు.

## 6.1 కేజీల గంజాయి పట్టివేత!! ద్విచక్రవాహనం స్వాధీనం

ఇద్దరి అరెస్ట్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు) ఆగస్టు 11**



టేకులపల్లి :ఆంధ్ర- ఒరిస్సా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి టేకులపల్లి మీదుగా బయటి ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న ఎండుగంజాయిని మంగళవారం కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీంపట్టుకుంది. ఎండుగంజాయి అక్రమ రవాణా సమాచారం మేరకు, కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్ టేకులపల్లి గ్రామ శివారు హెచ్ పి పెట్రోల్ బంక్ దగ్గర తనిఖీలు చేపట్టి ద్విచక్ర వాహనం (హోండా డియో) మీద అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి ఎండు గంజాయి, మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనశీ స్వాధీనం చేసుకొన్నారు. 6.1 కేజీల బరువు గల ఇట్టి ఎండు గంజాయి విలువ మూడు లక్షల ఐదు వేలుగా లెక్కించారు. అదుపులోకి తీసుకున్నవారు ఏ1: కొర్ర డేనియల్ కుమార్ గా/శీ భాస్కర్ రావ్ =/శీ రాజు క్యాంప్, వై రామవరం మండలం, అల్లూరి జిల్లా (ఏపీ)ఏ2: కిలో సాగర్ గా/శీ ప్రేమ్ దాస్ =/శీ రాజు క్యాంప్, వై రామవరం మండలం, అల్లూరి జిల్లా (ఏపీ)ఈ తనిఖీల్లో ఎస్.ఐ గౌతమ్, సిబ్బంది నరసింహారావు, శ్రీనివాసరావు, పార్థసారథి, రమేష్ పాల్గొన్నారు.

# జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు ఐదుగురు ప్లేయర్స్ అర్హత

- మాస్టర్ తైక్వాండో క్లబ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి ఘన విజయం.. రాష్ట్రస్థాయిలో 10 పతకాలు

**కోరుట్ల ఆగస్టు 11 (ప్రజాతీర్పు)**



తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని జి.ఆర్.ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు 8, 9, 10 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ కం నేషనల్ సెలక్షన్స్‌లో మాస్టర్ తైక్వాండో క్లబ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. కోరుట్ల--మెట్పల్లి ప్రాంతానికి చెందిన అకాడమీ నుంచి 20 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారు. వీరు 3 గోల్డ్, 2 సిల్వర్, 5 బ్రాంజ్ మెడల్స్‌తో మొత్తం 10 పతకాలు సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అకాడమీకి చెందిన ఐదుగురు క్రీడాకారులు జాతీయస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించడం విశేషం. ఈ సందర్భంగా అకాడమీ ఫౌండర్, తైక్వాండో కోచ్, నేషనల్ రెఫరీ మాస్టర్ నావనంది రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు పతకాలు సాధించడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించేలా నిరంతరం మెరుగైన శిక్షణ అందిస్తామని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కురువ శ్రీహరి మాస్టర్, అధ్యక్షుడు ముతా శ్రీనివాస్, ట్రెజరర్, జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ గాందె సంతోష్ మాస్టర్, జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు కోల గంగారావు అభినందించారు. అలాగే మాస్టర్ తైక్వాండో క్లబ్ మెట్పల్లి ప్రెసిడెంట్ ఎలగందుల అజయ్, మెట్పల్లి తైక్వాండో క్లబ్ ప్రెసిడెంట్ ఎండి. యాసిన్ అభినందనలు తెలిపారు. కోచ్‌లు నావనంది స్వరూప, జశ్వంత్, అమిత్యా పాల్గొన్నారు. 20 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పాల్గొని 10 పతకాలు సాధించడంతో పాటు ఐదుగురు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడంపై కోరుట్ల--మెట్పల్లి ప్రాంత క్రీడాభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అకాడమీకి అభినందనలు తెలిపారు.

# ఎండపల్లి సింగిల్ విండో చైర్మన్ పదవి "రెడ్డి"ల గుత్తాధిపత్యమా..?

- గత నాలుగు దశాబ్దాలుగా ఒకే సామాజిక వర్గానికి అవకాశం
- ఈసారి ఎస్సీ లేదా బీసీ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి ఇవ్వాల్సిందే..
- లేదంటే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామం తప్పదు
- మండలంలోని అధికార కాంగ్రెస్ పార్టీలోని ఎస్సీ,బీసీ సామాజిక వర్గ నాయకుల డిమాండ్

**( ఎలుక భగవాన్ యాదవ్,ప్రజా తీర్పు, ఎండపల్లి ) ఆగస్టు 11:**



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలోని సింగిల్ విండో చైర్మన్ పదవిపై అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులంతా ఐక్యరాగం వినిపిస్తూ లోపాయికారంగా తిరుగుబావుటా ఎగరవేస్తున్నట్లుగా సమాచారం . ఎండపల్లి సింగిల్ విండో చైర్మన్ పదవి గత నాలుగు దశాబ్దాలుగా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికే దక్కుతుందని, ప్రస్తుతం ప్రభుత్వం నామినేటెడ్ ద్వారా చైర్మన్ పదవి కట్టబెడుతున్న తరుణంలో ఈసారైనా ఎస్సీ లేదా బిసి సామాజిక వర్గాలకు చెందిన వారిలో అర్హులైన నాయకులకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కోరుతున్నారు. పదవులు ఒక సామాజిక వర్గానికే పరిమితం కాకుండా అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం కల్పించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బడుగు,బలహీన వర్గాల నాయకులంతా అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఎండపల్లి సింగిల్ విండోలో అధిక శాతం ఓటర్లలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఉండగా, చైర్మన్ పదవికి ఎస్సీ బీసీ ఓటర్లలో అర్హులు లేరా..? అనే ప్రశ్న మొదలైంది.నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్ గిరి మళ్లీ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయిస్తే సహించేది లేదనే కోణంలో కాంగ్రెస్ నాయకులంతా ఉన్నట్లు వినికిడి. ఈ విషయమై ఎండపల్లి మండల "ప్రజా తీర్పు" ప్రతినిధి అధికార పార్టీకి చెందిన ఎస్సీ,బీసీ సామాజిక వర్గానికి చెందిన కొందరు నాయకులతో తమ అభిప్రాయాలు సేకరించగా మెజారిటీ నాయకులంతా ఈసారి చైర్మన్ పదవి బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి కేటాయించకుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం వాటిల్లుతుందని స్పష్టం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండాలు మోసి, పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్రంగా కృషిచేసిన బడుగు బలహీన వర్గాల కార్యకర్తలను విస్మరించి, కొత్తగా పార్టీలో చేరిన పారాచూట్ నాయకులకో లేదా షాడో మంత్రులు సూచించిన వ్యక్తులకు చైర్మన్ పదవి అప్పగిస్తే నిరసనగా ఆమరణ దీక్షకు పూనుకుంటానని ఓ దళిత నాయకుడు పేర్కొనడం గమనార్హం. ఏదేమైనా ఈసారి చైర్మన్ గిరి అగ్రవర్గాలకు కేటాయిస్తే పార్టీ క్యాడరంతా చెల్లా చెదురై పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లి, బిఆర్ఎస్ పార్టీకి అవకాశం కలిసి వచ్చేలా కనిపిస్తుంది. ఇప్పటికే ధర్మపురి నియోజకవర్గంలో షాడో మంత్రులదే హవా కొనసాగుతుందని, వాస్తవానికి నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నామ మాత్రపు మంత్రేననే అపవాదును ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నాయకులతో మంత్రి మూటగట్టుకున్నారు. ఈ విషయమై మంత్రి లక్ష్మణ్ కుమార్ అగ్రవర్గాల వైపే మొగ్గుచూపుతారో, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా సామాజిక న్యాయాన్ని పాటిస్తూ బడుగు బలహీన వర్గాల కు అవకాశం ఇస్తారో..? మంత్రి నిర్ణయం పైనే పార్టీ భవిష్యత్ ఆధారపడి ఉన్న తరుణంలో మంత్రి ఏ విధమైన నిర్ణయం తీసుకుంటాడో వేచి చూడాల్సిందే.



## నాయి బ్రాహ్మణుల హక్కుల కోసం ఐక్య పోరాటం

- ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయించాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 11 (ప్రజా తీర్పు)**

నాయి బ్రాహ్మణుల హక్కుల సాధన, సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ఐక్యంగా ఉద్యమించాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని సీపీఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో మంగళవారం జిల్లా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కడియాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాలు, సెలూన్ వృత్తి అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కురిమెళ్ళ శంకర్, జిల్లా అధ్యక్షులు కడియాల సత్యనారాయణ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకవర్గాన్ని నియమించాలని, సమగ్ర అభివృద్ధి కోసం రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సెలూన్ షాపులకు ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ రాయితీ బకాయిలను వెంటనే చెల్లించాలని, కొత్తగా సెలూన్లు ఏర్పాటు చేసుకునే వారికి సబ్సిడీ కల్పించాలని కోరారు. ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్స్‌లలో నాయి బ్రాహ్మణులకు ప్రత్యేకంగా సెలూన్ షాపులు కేటాయించాలని, గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని నిరుపేద నాయి బ్రాహ్మణ కుటుంబాలను గుర్తించి ఇందిరమ్మ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని, ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. స్థానిక సంస్థల్లో నాయి బ్రాహ్మణులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. కులం పేరుతో ఎవరైనా అవమానిస్తే చట్టపరంగా పోరాడాలని, పిల్లలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని నాయకులు సూచించారు. సంఘాన్ని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేసి సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం కొత్తగూడెం మండల కమిటీని నియమించారు. మండల అధ్యక్షులుగా జనగామ వంశీ, ప్రధాన కార్యదర్శిగా కురిమెళ్ళ వేణును నియమించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అరసవిల్లి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి ముక్తేశ్వరరావు, రాష్ట్ర నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, మండలాల ప్రతినిధులు, వందలాది మంది నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.



## కుల సంఘాల అభివృద్దే ధ్యేయంగా...కాంగ్రెస్ ప్రభుత్వం

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 11**

జగిత్యాల శ్రీ భక్త మార్కండేయ ఆలయం లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన 5లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య . అంతకుముందు ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం లో అన్ని కుల సంఘాల అభివృద్ధి కి నిధులు మంజూరు చేయటం జరిగింది. మార్కండేయ ఆలయ అభివృద్ధి కి మరింత కృషి చేస్తా.. రాజకీయాల్లోకి రాకముందే పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. ముఖ్యమంత్రి సహకారం తో జగిత్యాల పట్టణం మరింత అభివృద్ధి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, సెక్రటరీ బండ శంకర్ ,కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ ,వీరబత్తిని శ్రీనివాస్,పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్,కౌన్సిలర్ లు పవిత్ర మహేష్, సాయి కిరణ్ ,వేముల శ్రీనివాస్ అధ్యక్షులు భోగ గంగాధర్ కార్యవర్గ సభ్యులు ,సంఘం సభ్యులు ,నాయకులు క్యాదసు నాగయ్య, నక్కల రవీందర్ రెడ్డి,వినోద్, కుసరి అనిల్ ,దుమల రాజ్ కుమార్ ,మహేందర్, శ్రవణ్,పంబాల రాము,కూతురు శేఖర్,దాసరి ప్రవీణ్, అల్లే గంగ సాగర్, మిలింద్ విజయ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువతుల వస్త్రధారణ యువకులను చెడగొట్టదు

ఓ యువతి వస్త్రధారణ ఆమె వ్యక్తిగత నిర్ణయమని.. ఆమె జీన్స్ వేసుకొన్నంత మాత్రాన అది యువకులను చెడగొడుతుందని భావించడం ఆమోదయోగ్యం కాని మనస్తత్వం అని ఢిల్లీ హైకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. యువతుల వస్త్రధారణను నియంత్రించే బదులు, తల్లిదండ్రులు, సమాజం తమ పిల్లలకు తప్పనిసరిగా వారి ప్రవర్తనను నియంత్రించుకొనేలా, వ్యక్తిగత హద్దులను గౌరవించేలా, ప్రతి మనిషినీ గౌరవించేలా నేర్పించాలని సూచించింది. 2013లో తన పొరుగున ఉన్న వ్యక్తి తనను వెంబడించి లైంగిక భావనలతో కూడిన వ్యాఖ్యలు చేశాడని, అసభ్యంగా తాకాడని ఓ యువతి ఆరోపించిన కేసులో కోర్టు ఈ మేరకు వ్యాఖ్యానించింది. నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ ఐపీసీ సెక్షన్ 354ఏ (1)(ఐ) కింద శిక్ష విధిస్తున్నట్టు తెలిపింది.

# బోనాల కళా జాతర అభినందనీయం

- జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 11.**



జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల బోనాల జాతర వర్కింగ్ కమిటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం జగిత్యాల మినీ స్టేడియం నుండి పోచమ్మ వాడలో పోచమ్మ తల్లికి బోనాల సమర్పణ మరియు సాంస్కృతిక కార్యక్రమాల కార్యక్రమానికి హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జిల్లా తొలి జెడ్పి చైర్మన్ దావ వసంత, డి సి సి అధ్యక్షులు గాజంగి నందయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, హరి చరణ్ రావు పాల్గొని ముచ్చట చేశారు. ప్రముఖులు మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వర్షాలు కురవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ రోజు యూట్యూబ్ కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోనాల వేడుకల్లో పాల్గొనడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. నేటి కాలంలో సోషల్ మీడియా, యూట్యూబ్ ద్వారా మన తెలంగాణ కళలు, జానపద సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేస్తున్న కళాకారుల కృషి అభినందనీయం. మన పండుగలు కేవలం ఆచారాలు మాత్రమే కాదు. అవి మన సంస్కృతిని, మన చరిత్రను, మన ఐక్యతను భావితరాలకు అందించే వారధులు. యువత మన సంప్రదాయాలను కాపాడుతూ, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వాటిని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందించదగ్గ విషయం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా మన సంస్కృతి, కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు అరవ లక్ష్మీ దయల చంద్ర కళ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల బోనాల జాతర వర్కింగ్ కమిటీ సభ్యులు మల్లిక్ తేజ, సీనియర్ కళా ప్రతినిధులు కళాశ్రీ గుండేటి రాజు, ఎలిగేటి రాజేంద్రప్రసాద్, గొల్లపెల్లి శ్రీరాములు గౌడ్, అభి, కొమరవెల్లి చిరంజీవి,పి.ఎల్ రెడ్డి,సునీల్, క్రాంతి దగడు, కచ్చు మహేష్ ,మహేష్,గంగాధర్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సమయపాలన పాటించాలి.. ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు

- ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావాలి

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి )ఆగస్టు 11**

గార్ల. స్థానికమండల కేంద్రంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని మండల ప్రజలు కోరుతున్నారు. తమ పనుల నిమిత్తం ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. అయితే కొన్నిచోట్ల సిబ్బంది నిర్ణీత సమయానికి కార్యాలయాలకు హాజరు కాకపోవడంతో ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు, వృద్ధులు, మహిళలు, కూలీలు దూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలతో కార్యాలయాలకు వచ్చినప్పుడు సంబంధిత సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల వారి పనులు ఆలస్యమవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఒక చిన్న పని కోసం పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలు అందించేందుకే ఉన్నందున అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయానికి విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సిబ్బంది హాజరు, సమయపాలనపై పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించి, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించేందుకు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సింగిల్ విండో చైర్మన్ పదవి బీసీలకే కేటాయించాలి

- బీసీ కులాల ఐక్యవేదిక ఎండపల్లి మండల గౌరవ అధ్యక్షుడు అల్లె వెంకటేష్ యాదవ్

**ఎండపల్లి, ఆగస్టు 11 (ప్రజాతీర్పు)**



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలోని సింగిల్ విండో చైర్మన్ పదవిని ఈసారి బీసీ సామాజిక వర్గానికే కేటాయించాలని బీసీ కులాల ఐక్యవేదిక మండల శాఖ గౌరవ అధ్యక్షుడు అల్లే వెంకటేష్ యాదవ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగిల్ విండో చైర్మన్ పదవిలో గత నలభై ఏళ్లుగా అగ్రవర్గాలలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కొనసాగుతున్నారని, సింగిల్ విండో చైర్మన్ పదవికి బీసీ సామాజిక వర్గ నాయకులు అర్హులు కారా అని ప్రశ్నించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగిల్ విండో చైర్మన్ లను నామినేటెడ్ పద్ధతిలో నియమిస్తున్నందున బీసీలకు అవకాశం కల్పించాలని, లేనియెడల ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



## చెక్‌డ్యామ్ మరమ్మతులు చేపట్టాలి

- 1250 ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు కోరం కనకయ్యకు వినతి

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 11**

టేకులపల్లి: మండలంలోని బోడు ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామపంచాయతీ ప్రజలు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం సమర్పించారు. 2003 సంవత్సరంలో శంకుస్థాపన చేసిన చెక్‌డ్యామ్ పనులను అనంతరం పూర్తి చేశారని తెలిపారు. అయితే చెక్‌డ్యామ్ కాలువ నిర్మాణానికి అవసరమైన అనుమతులు లేకపోవడంతో అధికారులు నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. రెండేళ్ల అనంతరం అనుమతులు వచ్చినప్పటికీ కాలువ నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం చెక్‌డ్యామ్ పూర్తిగా దెబ్బతినడంతో పాటు కాలువలు కూడా పాడైపోయాయని తెలిపారు.ఈ చెక్‌డ్యామ్ వల్ల సుమారు 1250 ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని, బోడు ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని రైతులతో పాటు పరిసర గ్రామాల రైతులకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. వెంటనే చెక్‌డ్యామ్, కాలువలకు మరమ్మతులు చేపట్టి సాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు.



## కెనడా దేశ పార్లమెంట్‌ను సందర్శించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**నర్సంపేట టౌన్ ఆగస్టు 11 ప్రజా తీర్పు**

విదేశీ పర్యటనలో భాగంగా కెనడా దేశంలోని పార్లమెంట్ ను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వారి కుమారుడు అవియుక్త్ రెడ్డి తో కలసి సందర్శించారు ఈ సందర్భంగా కెనడా పార్లమెంట్ యొక్క ఎగువ సభ(సెనేట్) మరియు దిగువ సభ ( హౌస్ ఆఫ్ కామన్స్ ) విశిష్టతలను అక్కడి అధికారులను తెలుసుకున్నారు.



# పీహెచ్‌సీలో వైద్యులు సమయపాలన పాటించాలి

- ఏజెన్సీ మండల ప్రజల డిమాండ్
- డీఎండహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి..

**(పగడాల రామారావు ప్రజా తీర్పు బయ్యారం మండల ప్రతినిధి) రాష్ట్ర 11**

బయ్యారం స్థానిక మండల కేంద్రం, ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (పీహెచ్‌సీ) వైద్యం కోసం వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని ఏజెన్సీ మండల ప్రజలు కోరుతున్నారు. వైద్యుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యుల హాజరు, సమయపాలన, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించేందుకు డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా తనిఖీలు చేపట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించి, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, అత్యవసర వైద్యం అవసరమైన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా పీహెచ్‌సీల పనితీరును పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ వైద్యంపై ఆధారపడే పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## నెక్కొండ మండలం లోని అన్ని గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ప్రతిష్ఠాపనకు అనుమతి కోరుతూ వినతి

**నెక్కొండ, ఆగస్టు 11, ప్రజా తీర్పు ప్రతినిధి:**

నెక్కొండ మండలం లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ వరంగల్ జిల్లా నెక్కొండ మండల ఎమ్మార్వో కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య,మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివ కుమార్,మాజీ వైస్ ఎంపీపీ ధోనికేనా సారంగపాణి,మండల నాయకులు కారింగుల సురేష్ గౌడ్,మాజీ రామాలయం కమిటీ చైర్మన్ పొడిశెట్టి సత్యం,దాసరి శ్రీనివాస్,ఈదునూరి వెంకన్న,మాజీ సర్పంచులు మాదాసు రవి,జల్లే సుదర్శన్,ముదిగొండ సర్పంచ్ పున్నం రంగారెడ్డి,రెడ్లవాడ సర్పంచ్ దగ్గు గాంధీ,నాయకులు లింగ్యనాయక్,ఐలయ్య,ఈదునూరి దిలీప్,కొయ్యడ శ్రీనివాస్,లావుడ్యా నరేష్,యాకు,తేజవత్ రవీందర్,ఊళ్లేరావు ప్రభాకర్,మునిగా అశోక్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ, బహుజన ఉద్యమ నాయకుడు డ్యాగల శ్రీనివాస్ నుపరామర్శించిన పి ఆర్ ముదిరాజ్ సేవా సమితి నాయకులు

### పిఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు దండు చిరంజీవి ముదిరాజ్

**నర్సంపేట రూరల్, ఆగస్టు 11, ప్రజా తీర్పు ప్రతినిధి:**

ఇటీవల కాలంలో బెంగళూరులో జరిగిన అఖిల భారత జాతీయ బీసీ మహాసభల కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో అనుకోని రీతిలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ కాలు జారి కింద పడిపోవడంతో తలకు, కాలుకు దెబ్బ తగలడం జరిగింది. డ్యాగల శ్రీనన్న నర్సంపేట పట్టణంలోని తన నివాసానికి వచ్చిన విషయం తెలుసుకున్న పిఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు దండు చిరంజీవి ముదిరాజ్, నర్సంపేట పట్టణ అధ్యక్షులు ధోనీ చేరాలు ముదిరాజ్ లు నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించడం జరిగిందన్నారు. అనంతరం దండు చిరంజీవి మాట్లాడుతూ డ్యాగల శ్రీనన్న లాంటి అభ్యుదయ భావజాలం కలిగిన ఉద్యమ నేతకు ఇలా జరగడం బాధాకరంగా ఉందని అన్నారు. నియోజకవర్గంలో బడుగు బలహీన వర్గాల బహుజనులకు అందుబాటులో ఉండే బీసీ బహుజన నాయకుడు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ త్వరగా కోలుకొని బహుజనుల మధ్యకు రావాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు దండు చిరంజీవి ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, పిఆర్ ముదిరాజ్ సేవా సమితి పట్టణ అధ్యక్షుడు ధోని చేరాల ముదిరాజ్, దుగ్గొండి మండల కార్యదర్శి పొన్నం రాజు ముదిరాజ్, నాయకులు దండు రమేష్ ముదిరాజ్, గంగరబోయిన నవీన్ ముదిరాజ్ తదితరలు పాల్గొన్నారు.

## 950 కోట్ల స్పేస్‌పోర్ట్ ప్రైవేట్‌పరం!

భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రక పరిణామం చోటుచేసుకుంటున్నది. తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్నంలో ఇస్రో రూ. 950 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఉపగ్రహ ప్రయోగ కేంద్రం(ఎస్ఎల్‌సీ) నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్‌రంగానికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్(ఇన్ స్పేస్) దీనికి సంబంధించిన అర్హులైన భారత ప్రైవేట్ సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ కొత్త స్పేస్‌పోర్ట్ ద్వారా చిన్న రాకెట్ల ప్రయోగాలు మరింత సులభతరం కానున్నాయి. శ్రీహరి కోట నుంచి ప్రయోగాల సమయంలో శ్రీలంకను తప్పించుకునేందుకు అధిక ఇంధనం ఖర్చు చేయాల్సి వస్తున్నది. అయితే కులశేఖరపట్నం నుంచి నేరుగా దక్షిణం వైపు రాకెట్లను ప్రయోగించడం ద్వారా ఇంధన ఆదా జరుగడంతో పాటు పేలోడ్ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. ఇస్రో చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనం(ఎస్ఎస్ఎల్వీ)తోపాటు స్కైరూట్, అగ్నికుల వంటి ప్రైవేట్ రాకెట్ల ప్రయోగాలకు ఇది ప్రత్యేక కేంద్రంగా మారనుంది. ఎంపికైన ప్రైవేట్ సంస్థకు ఇస్రో సాంకేతిక మార్గదర్శకత్వం, ప్రారంభ ప్రయోగాల సమయంలో శిక్షణ అందిస్తుంది.

# కౌశిక్ రెడ్డి పద్ధతి మార్చుకోకపోతే రాళ్ళ దెబ్బలు తప్పవు... వొడితల ప్రణవ్..

- డబుల్ ఇళ్ల విషయంలో కౌశిక్ రెడ్డి దొంగ డ్రామాలు.
- ఎమ్మెల్సీగా,విప్ ఉన్నా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎందుకు పంచలేదో సమాధానం చెప్పాలి..
- అబద్ధాన్ని ప్రచారం చేస్తే నిజం అవుతుందనే భ్రమలో ఉన్నాడు.
- మంత్రుల ముందు కౌశిక్ రెడ్డి ప్రవర్తన సిగ్గుచేటు..
- ఎమ్మెల్సీగా,విప్ గా,ఇప్పుడు ఎమ్మెల్యేగా పూర్తి స్థాయిలో విఫలం..
- హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి ముమ్మాటికి కాంగ్రెస్ తోనే సాధ్యం...
- సోషల్ మీడియాలో సోకులు తప్ప ప్రజల బాగోగులపై ధ్యాస లేదు..

**జమ్మికుంట ఆగస్టు 11 ప్రజాతీర్పు**



హుజురాబాద్ నియోజవర్గ అభివృద్ధి కొరకు నిత్యం మంత్రులతో,అధికారులతో మాట్లాడుతూ వారిని ఒప్పించి,అభివృద్ధికి నిధులు తీసుకొచ్చే విషయంలో తాము కృషి చేస్తుంటే వచ్చిన మంత్రుల ముందు హుజురాబాద్ నియోజవర్గ పరువు కౌశిక్ రెడ్డి తీసాడని ఆగ్రహం వ్యక్తం చేశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.జమ్మికుంట మండల పరిధిలోని గండ్రపల్లి గ్రామంలో ప్రణవ్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్లు విషయంలో రెండున్నర ఏళ్ళు ఎమ్మెల్సీగా,ప్రభుత్వ విప్ గా ఉండి పేదలకు ఇళ్లను ఎందుకు పంచలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాలు మాట్లాడడం ఇష్టం లేని కౌశిక్ రెడ్డి అబద్ధాలను ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోబోమని,2017లో డబుల్ బెడ్ రూం ఇళ్లు సగం కట్టి వదిలేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు ఇంచార్జ్ మంత్రుల సహకారంతో నిధులు మంజూరు చేపించి ఇప్పుడు గృహ ప్రవేశాలకు వెళ్తుంటే కౌశిక్ రెడ్డి ఓర్వలేకపోతున్నాడని,కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీ గా,విప్ గా అధికారంలో ఉండి కూడా చేయలేకపోయాడనీ తాము చేస్తుంటే ప్రజలకు పంచకుండా అడ్డుపడ్డడం ప్రజలు గమనించాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గా హుందాతనంగా వ్యవహరించాల్సిన ప్రజా ప్రతినిధి ప్రజల సంక్షేమానికి విరోధకంగా వ్యవహరించడం సిగ్గు చేటని,ఇలాంటి చర్యలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రానున్న రోజుల్లో ఇప్పుడు పంపిణీ చేసిన డబుల్ ఇళ్లతో పాటు జమ్మికుంట,హుజురాబాద్,బుజునూర్ గ్రామంలో కట్టిన ఇళ్లకు నిధులు కేటాయించి అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేస్తామని అన్నారు. వీటితో పాటు సంక్షేమ పథకాలు కూడా ప్రజలకు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు పరశు రాం,పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్,హుజురాబాద్ మండల అధ్యక్షుడు కిరణ్,వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ స్వప్న-సదానందం,వైస్ చైర్మన్ సత్తి రెడ్డి,డైరెక్టర్లు,మహిళ మండల అధ్యక్షురాలు స్వప్న,మహిళా నాయకురాల్లు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెయిన్ రోడ్డు అభివృద్ధి ఇదేనా?

- పనులు చేపట్టి.. ప్రజలకు నరకం చూపిస్తారా?
- తవ్వకాలు, నిర్మాణ వ్యర్థాలతో వ్యాపారులు.. ప్రజలకు తిప్పలు
- మున్సిపాలిటీ తీరుపై పట్టణవాసుల ఆగ్రహం

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 11,(ప్రజా తీర్పు):**




పెద్దపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డు అభివృద్ధి పనుల తీరుపై ప్రజలు, వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై పనులు చేపట్టినప్పటికీ రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాలు, తవ్వకాలు, నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. దుకాణాల వద్దకు వెళ్లేందుకు సరైన మార్గం లేక వ్యాపారులు, వినియోగదారులు అవస్థలు పడుతున్నారని పేర్కొంటున్నారు.

### అభివృద్ధి అంటే ఇబ్బందులు పెట్టడమేనా?

అభివృద్ధి పనులు చేపట్టడం స్వాగతించదగినదేనని, అయితే ప్రజలకు కనీస ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని పట్టణవాసులు అంటున్నారు. డ్రైనేజీ, ఫుట్‌పాత్‌లు, రోడ్డు ఎత్తు, ట్రాఫిక్ నియంత్రణ, దుకాణాలకు ప్రవేశ మార్గాలు, నిర్మాణ వ్యర్థాల తొలగింపు వంటి అంశాలపై ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు.

### అధికారుల పర్యవేక్షణ ఏది?

ప్రజాధనంతో చేపడుతున్న పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయా? అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారా? పనుల వల్ల ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడితే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధి పనుల వివరాలు, నాణ్యతా ప్రమాణాలు, గడువు, పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు తదితర వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.

### రేపు మిగతా రోడ్ల పరిస్థితి?

"మెయిన్ రోడ్డు పరిస్థితి ఇలాగే ఉంటే.. పట్టణంలోని ఇతర రోడ్ల అభివృద్ధి ఎలా ఉండబోతోంది?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, ప్రజలకు ఉపయోగపడేలా శాస్త్రీయ ప్రణాళికతో పనులు చేపట్టాలని కోరుతున్నారు. మెయిన్ రోడ్డుపై పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించి, దెబ్బతిన్న రహదారిని పునరుద్ధరించాలని, పాదచారులు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించాలని పట్టణవాసులు మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



## మోడల్ స్కూల్,జ్యోతిబాపూలే స్కూళ్లలో మెడికల్ క్యాంపు నిర్వహించిన డాక్టర్. జ్యోతి

- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నర్సంపేట రూరల్, ఖానాపూర్, ఆగస్టు 11, ప్రజా తీర్పు ప్రతినిధి:**

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుధరావుపేట మోడల్ స్కూల్ , మరియు హాస్టల్ ను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జ్యోతి సందర్శించి హాస్టల్ మెస్ రూమ్ స్టోర్ రూమ్ ,వాష్ రూమ్ మరియు సానిటేషన్ తనిఖీ చేసి తగు సూచనలు ఇవ్వడంజరిగింది. పరిసరాలుపరిశుభ్రంగాఉంచుకోవాలని, ఈగలు వాలకుండా చూసుకోవాలని తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థులతో సమావేశమై సీజన్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ,కలుషిత నీరు ఆహారం వల్ల టైఫాయిడ్, వాంతులు విరోచనాలు అయ్యే అవకాశం ఉంటుందని, జాగ్రత్తగా ఉండాలని,వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. తర్వాత వజీనేపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ సందర్శించి మెడికల్ క్యాంపు నిర్వహించి సాధారణ జలుబు దగ్గు, ఎలర్జీ వ్యాధులకు మందులు ఇవ్వడం జరిగింది. హాస్టల్లోమెస్, స్టోర్ రూమ్ మరియు పరిసరాలను తనిఖీ చేసి పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత ,మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిత మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జమీరుద్దీన్ హెల్త్ సూపర్వైజర్ దామోదర్ రెడ్డి జ్యోతిబాపూలే స్టాఫ్ నర్స్ శిరీష, హెల్త్ అసిస్టెంట్స్ భాస్కర్, జ్యోతి, మోడల్ స్కూల్ ఏఎన్ఎంశారద ఆశా జ్యోతి పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఆషాడ మాసం బోనాల కార్యక్రమం

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 11**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఆషాడ మాసం సందర్భంగా పాఠశాలలో బోనాల కార్యక్రమం నిర్వహించారు, పాఠశాల విద్యార్థులు , చిన్నారులు పోతరాజుల వేషధారణతో అలరించారు, అమ్మవారికి పాఠశాలలో ఏర్పాటుచేసిన చిత్రపటం ద్వారా పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు, ప్రిన్సిపాల్ సంజీవ్, డీన్ ప్రదీప్, ప్రైమరీ ప్రిన్సిపాల్ లు సౌజన్య , పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# కొల్వాయిలో ఘనంగా ఉచిత కంటి వైద్య శిబిరం

- విద్యతో పాటు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహణ..

**బీర్పూర్. ఆగస్టు11 (ప్రజా తీర్పు )**



సామాజిక బాధ్యతలో భాగస్వామ్యమవుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కొల్వాయి గ్రామంలోని అక్షర ఉన్నత పాఠశాల యాజమాన్యం మరో విశిష్ట సేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. లయన్స్ క్లబ్ మరియు కరీంనగర్ రేకుర్తి కంటి వైద్యశాలల సంయుక్త సహకారంతో మంగళవారం అక్షర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ శిబిరానికి పరిసర గ్రామాల నుండి ప్రజలు విశేషంగా తరలివచ్చారు. డాక్టర్ భాస్కర్ మాడేకర్ నేతృత్వంలోని నిపుణులైన వైద్య బృందం మొత్తం 60 మందికి అధునాతన పరికరాలతో కంటి పరీక్షలు పూర్తి చేశారు. అందులో 20 మందికి కంటి చూపు సమస్య తీవ్రంగా ఉండి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. అలా ఎంపిక చేసిన రోగులను ఉచిత మెరుగైన చికిత్స, శస్త్రచికిత్సల కోసం లయన్స్ క్లబ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత బస్సు ద్వారా కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి భద్రంగా తరలించారు. ఈ సందర్భంగా అక్షర పాఠశాల కరస్పాండెంట్ పైడి మారుతి మాట్లాడుతూ... "మానవ శరీరంలో అత్యంత కీలకమైనది కంటి చూపు. దృష్టి లోపాలు ఉంటే జీవితంలో ఏ పనీ సరిగ్గా చేసుకోలేమని, కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి" అని వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలనే సంకల్పంతోనే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులోనూ అక్షర పాఠశాల ఆధ్వర్యంలో ఇటువంటి అనేక రకాల సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ ఉదార నిర్ణయంపై మరియు చేస్తున్న నిరంతర సామాజిక సేవలపై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ జనార్ధన్ సిందే, ట్రెసరర్ అప్పాల రాజలింగం,వివిధ గ్రామాల ప్రజలు, వైద్య బృందం, ప్రాథమిక చికిత్స వైద్యులు సాయి, మరియు లయన్స్ క్లబ్ సభ్యులు పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బోడుప్పల్ లో యూనివర్సల్ హ్యూమన్ రైట్స్, లీగల్ అవేర్నెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులకు ధృవపత్రాల పంపిణీ

**బోడుప్పల్ సర్కిల్, ఆగస్టు 11.( ప్రజాతీర్పు )**

మేడ్చల్ మల్కాజ్గిరి,బోడుప్పల్ సర్కిల్, యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ లీగల్ అవేర్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రోజు ధృవపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఫౌండర్, నేషనల్ డైరెక్టర్ దావనపల్లి కమలాకర్ సమక్షంలో, తెలంగాణ రాష్ట్ర మహిళా జనరల్ సెక్రెటరీ మీరాజ్ ఫాతిమా, మరియు మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు రంగారెడ్డి బత్తిని మీనా గౌడ్, నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ సెక్రెటరీగా మల్కా సంజీవరెడ్డి (సిద్దిపేట), సిద్దిపేట జిల్లా ప్రెసిడెంట్‌గా బెక్కంటి సంపత్, సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా యాసరేణి బాలయ్యలకు ధృవపత్రాలను అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులకు ఫౌండర్, నేషనల్ డైరెక్టర్ దావనపల్లి కమలాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆశయాలను




ప్రజల్లోకి తీసుకెళ్లి, మానవ హక్కులు మరియు చట్టపరమైన అవగాహన కల్పించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ జనరల్ సెక్రెటరీ అడప రవళిక, ప్రతినిధులు, నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మల్కా సంజీవరెడ్డి, బెక్కంటి సంపత్, యాసరేణి బాలయ్యలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ఎస్ఐఆర్‌లో మెదక్ జిల్లా 100 శాతం డిజిటలైజేషన్

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**(వంజరపు) ఎల్లం ప్రజాతీర్ప ప్రతినిధి మాసాయిపేట్) ఆగస్టు 11**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మెదక్ జిల్లా ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ,ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25వ తేదీన ప్రారంభమైందని తెలిపారు. తొలి దశలో జూన్ 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించడంతో పాటు ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను మెదక్ జిల్లాలో నూరు శాతం పూ ర్తి చేసినట్లు వెల్లడించారు. మెదక్ నియోజకవర్గంలో మొత్తం 2,20,427 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,01705 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 91.51 శాతంగా ఉందని పేర్కొన్నారు. మిగిలిన 18,722 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 5431 మంది మరణించిన వారు, 3433 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 8948 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు,874 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని,36 అదర్స్ గా ఉన్నారని వెల్లడించారు. అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 8.49 శాతంగా ఉందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం 232713 మంది ఓటర్లు ఉండగా, వారిలో 20,8499 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 89.59 శాతంగా ఉందని తెలిపారు . మిగిలిన 24,214 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 7735 మంది మరణించిన వారు, 3414 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 12153 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 634 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని వెల్లడించారు. 278 అదర్స్ గా అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 10.41 శాతంగా ఉందన్నారు. డిజిటలైజేషన్ పూర్తయిన వారి శాతం, వివిధ కారణాలతో అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన శాతం కలిపి మెదక్ ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను జిల్లా కలెక్టర్ అభినందించారు.



# పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ నిర్మాణం, స్థాపనకు అనుమతి కోరుతూ ఆర్డీవోకు వినతి

**నర్సంపేట టౌన్ ఆగస్టు 11 ప్రజా తీర్పు**

ఈ కార్యక్రమంలో నర్సంపేట మండల కన్వీనర్ కోమాండ్ల గోపాల్ రెడ్డి మరియు కమ్మపల్లి గ్రామ సర్పంచ్ మిట్టగడపాల లక్ష్మి చిరంజీవి , ఉపసర్పంచ్ అల్లే రవికుమార్ మరియు కమ్మపల్లి బి ఆర్ ఎస్ అధ్యక్షులు మిట్టగడపాల మలయ్య , వార్డ్ మెంబర్ మిట్టగడపాల తిరుపతి, కొమ్ముక సుమన్, అజ్మీరా బాలురాజ్ మరియు బి ఆర్ ఎస్ గ్రామ సీనియరు నాయకులు పెండ్యాల మునేందర్ అల్లే రాజు పెండ్యాల రవి మిట్టగడపాల హరిప్రసాద్ కొమ్ముక ప్రశాంత్ పాల్గొనడం జరిగింది



# తిరంగా యాత్రను విజయవంతం చేయాలి

- పెద్దపల్లిలో 13న భారీ ర్యాలీ
- 500 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి పిలుపు

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 11,(ప్రజా తీర్పు):**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 13న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న తిరంగా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా యాత్రలో భాగంగా పెద్దపల్లిలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ర్యాలీకి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. దేశ సమైక్యత, సమగ్రతకు ప్రతీకగా నిర్వహిస్తున్న ఈ యాత్రలో 500 మీటర్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ ప్రజలు, యువత, యువజన సంఘాలు, కార్మికులు, రైతులు, వ్యాపారులు, వాణిజ్య వర్గాలు, విద్యాసంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంజీవరెడ్డి కోరారు. ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని మరింత పెంపొందించడమే తిరంగా యాత్ర లక్ష్యమని తెలిపారు. సమావేశంలో గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, తిరంగా యాత్ర జిల్లా కో-కన్వీనర్లు ఉషణ అన్వేష్, కావేటి రాజగోపాల్, పట్టణ కన్వీనర్ మధుకరన్, పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్‌యాదవ్, జిల్లా కార్యదర్శి శివంగారి సతీష్, రాజం మహంత కృష్ణ, రామగిరి అఖిల్, పూదరి హరీష్, రజనీకర్‌రెడ్డి, గాదాసి సతీష్, షిండే శివసాయి తదితరులు పాల్గొన్నారు.

## పాత పెట్రోల్ పంపు గల్లీలో మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీలను రిపేర్ చేయించిన కౌన్సిలర్- బాణాల ప్రసన్న శ్రీనివాస్

**నర్సంపేట టౌన్ ఆగస్టు 11 ప్రజా తీర్పు**



నర్సంపేట పట్టణంలోని 22వ వార్డులో మహబూబాబాద్ రోడ్డు పాత పెట్రోల్ బంక్ ప్రక్క గల్లీలో మిషన్ భగీరథ వాటర్ పైప్ లైన్ లీకేజీ అయినందున వాటర్ సప్లై సరిగా లేనందున వార్డు ప్రజల యొక్క ఫోన్ కాల్ తో స్పందించిన స్థానిక కౌన్సిలర్ బాణాల ప్రసన్న శ్రీనివాస్ వెంటనే స్పందించి మిషన్ భగీరథ వాటర్ లైన్మెన్ వేమ రంజిత్ పైప్లైన్ రిపేరర్లు గొర్రె సతీష్, హనుమకొండ ప్రతాప్ . ను పిలిపించి పైప్ లైన్ లీకేజీలను రిపేరు చేయించడం జరిగినది ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ బాణాల ప్రసన్న శ్రీనివాస్ లైన్మెన్ వేమ రంజిత్ వాటర్ సప్లై లో ఎలాంటి ఇబ్బందులు జరిగినా నిరంతరం వార్డులో పర్యటించి ఎప్పటికప్పుడు నాకు సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించడం జరిగినది అలాగే మహబూబాబాద్ రోడ్డు పాకాల రోడ్డు మధ్యలో ఉన్నటువంటి దుర్గమ్మ గుడి వద్ద ఈ శుక్రవారం బోనాల పండుగ ఉన్నందున గుడి ఆవరణ మొత్తంశుభ్రం చేయాలని మున్సిపాలిటీ జవాన్ గజ్జల మహేందర్ కు పారిశుధ్య సిబ్బందిని నియమించి శుభ్రం చేయించాలని సూచించి గుడి ప్రాంగణాన్ని పర్యవేక్షించడం జరిగినది బాణాల ప్రసన్న శ్రీనివాస్. 22వ వార్డు కౌన్సిలర్ నర్సంపేట.

# గీతాంజలి పాఠశాలలో బ్రహ్మకుమారీస్ సంస్థ వారి అవగాహన సదస్సు

**నర్సంపేట టౌన్ ఆగస్టు 11 ప్రజా తీర్పు**

కేంద్ర ప్రభుత్వం 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం ప్రతిష్టాత్మకంగా చేయాలనే ఉద్దేశంతో బ్రహ్మకుమారిస్ సంస్థ ద్వారా ప్రజలందరికీ అవగాహనను కలిగిస్తుంది. దీనిలో భాగంగా మంగళవారం 11- 8 - 2026 రోజున గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో మాదకద్రవ్య రహిత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి సంస్థ ముఖ్య కార్య నిర్వాహకులు మాట్లాడుతూ వ్యసనాలు మానవ జీవితాన్ని ఎంతో ప్రభావితం చేస్తాయని వాటి నుంచి బయటపడి మంచి పౌరులుగా జీవించాలని దానికి ధ్యానం క్రమశిక్షణతో కూడిన జీవన శైలిని అవలంబించాలని విద్యార్థులతో మాదక ద్రవ్యాల వినియోగ నిషేధ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ రాజేష్ మాట్లాడుతూ మన సమాజంలో ఉన్న రుగ్మతలలో అతిపెద్ద రుగ్మత మాదకద్రవ్యాల వినియోగం అని ఈ అలవాటుకు యువత వేగంగా ఆకర్షించబడి వారి




భవిత మరియు భవిష్యత్తులను అంధకారంలోకి తీసుకెళు_న్నారు చివరికి చేసిన తప్పును సరిదిద్దుకోలేక సమాజంలో జీవచ్ఛవంలా మారుతున్నారు కనుక నేటి విద్యార్థులే రేపటి పౌరులనే నినాదాన్ని నిజం చేసి మీరు వాటి పట్ల అవగాహనను పెంచుకొని మత్తు పదార్థాలను నిషేధిస్తూ అవసరమైతే వాటిని వినియోగించే వారికి వాటి వల్ల కలిగే నష్టాలను గూర్చి దాని ఫలితంగా వారి జీవితాలు ఎలా ప్రభావితం అవుతాయో తెలపడం మీ బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని ఈ నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగి ప్రజలలో అవగాహన శక్తి కలిగి మాదక ద్రవ్యాల వినియోగాన్ని మానుకొని దేశ ప్రగతికి తోడ్పడాలని ఆశాభావం వ్యక్తం చేశారు ముందు తరాల వారికి మత్తు పదార్థాల నిషేధం అలవాటుగా మారాలని ఆకాంక్షించారు.



# చిన్నారులు, వృద్ధుల సంరక్షణకు ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 11 (ప్రజాతీర్పు)**

సంక్షేమ సంస్థల్లోని చిన్నారులు, వృద్ధులకు మెరుగైన సౌకర్యాలు, భద్రత, నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని వివిధ సంక్షేమ సంస్థలు, పెద్దపల్లిలోని బాల రక్షక భవన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వంటశాలలు, వసతి గదులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, భద్రతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

బాల రక్షక భవన్‌లో పోక్సో కేసుల వివరాలను తెలుసుకుని, బాధిత చిన్నారులకు సకాలంలో రక్షణ, కౌన్సెలింగ్, అవసరమైన సహాయం అందించాలని సూచించారు. బాలల రక్షణపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.



# ఇల్లందకుంట పోలీసు స్టేషన్ పరిధిలో నార్కోటిక్ డాగ్‌తో విస్తృత తనిఖీ

**జమ్మికుంట ఆగస్టు 11 ప్రజాతీర్పు**

ఇల్లందకుంట పోలీసు స్టేషన్ పరిధిలో ఎవరైనా నిషేధిత మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కాంత్రికుమార్ అన్నారు. శుక్రవారం ఇల్లందకుంట పోలీసు స్టేషన్ పరిధిలోని ఇల్లందకుంట, బుజునూర్, సీతంపేట గ్రామంలలో కిరాణా షాపులు, హోటల్స్, పాన్ షాపుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ కాంత్రి కుమార్ మాట్లాడుతూ.. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడమే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన వొడితల ప్రణవ్..

- జమ్మికుంట మండల పరిధిలోని 12 గ్రామాల్లో,11 లక్షల విలువ చేసే చెక్కుల పంపిణీ..
- ప్రతి గడపకు సంక్షేమ పథకాన్ని అందజేస్తా..

**జమ్మికుంట ఆగస్టు 11 ప్రజాతీర్పు**

హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రతీ గడపకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాన్ని అందజేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం రోజున జమ్మికుంట మండల పరిధిలోని మాచనపల్లి,పెద్దంపల్లి, జగ్గయ్యపల్లి, సైదాబాద్, కోరపల్లి, విలాసాగర్, నగురం, వావిలాల, తనుగుల, గంద్రపల్లి, శాయంపేట, మడిపల్లి గ్రామాల్లో 11 లక్షల విలువ చేసే సిఎంఆర్ఎఫ్ చెక్కులను 34 మంది లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆత్మీయంగా పలకరించి,కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఇంచార్జి ప్రణవ్ మాకు అండగా ఉండి కష్టకాలంలో మమ్ములను ఆదుకున్నారని లబ్ధిదారులు తెలిపారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఇంటి,ఇంటికి వెళ్లి చెక్కులు ఇస్తున్నప్పుడు వారి కష్టాల్లో పాలుపంచుకోవడం జరుగుతుందని,ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలను ఆదుకుంటామని,గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు వీరమనేని పరశురామ్,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్ సభ్యులు,మార్కెట్ డైరెక్టర్లు,పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతుల వస్త్రధారణ యువకులను చెడగొట్టదు

న్యూఢిల్లీ: ఓ యువతి వస్త్రధారణ ఆమె వ్యక్తిగత నిర్ణయమని.. ఆమె జీన్స్ వేసుకొన్నంత మాత్రాన అది యువకులను చెడగొడుతుందని భావించడం ఆమోదయోగ్యం కాని మనస్తత్వం అని ఢిల్లీ హైకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. యువతుల వస్త్రధారణను నియంత్రించే బదులు, తల్లిదండ్రులు, సమాజం తమ పిల్లలకు తప్పనిసరిగా వారి ప్రవర్తనను నియంత్రించుకొనేలా, వ్యక్తిగత హద్దులను గౌరవించేలా, ప్రతి మనిషినీ గౌరవించేలా నేర్పించాలని సూచించింది. 2013లో తన పొరుగున ఉన్న వ్యక్తి తనను వెంబడించి లైంగిక భావనలతో కూడిన వ్యాఖ్యలు చేశాడని, అసభ్యంగా తాకాడని ఓ యువతి ఆరోపించిన కేసులో కోర్టు ఈ మేరకు వ్యాఖ్యానించింది. నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ ఐపీసీ సెక్షన్ 354ఏ (1)(ఐ) కింద శిక్ష విధిస్తున్నట్టు తెలిపింది.



## జ్వరాల నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు.. పీహెచ్‌సీలకు డీఎంహెచ్‌వో హెచ్చరిక

**కరీంనగర్, ఆగస్టు 11 ( ప్రజా తీర్పు )**

వర్షాకాలంలో జ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రాజగోపాల్ రావు వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం వెల్ది, చెల్లూరు, వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వైద్య సేవల అమలు తీరును పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా హాజరు రిజిస్టర్లు, ఓపీ నమోదు పుస్తకాలు, ఎన్‌సీడీ రికార్డులు, ఫార్మసీ స్టోర్లు, వ్యాక్సిన్ల నిల్వ కోసం వినియోగిస్తున్న ఐఎల్‌ఆర్, ఉష్ణోగ్రత నమోదు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రులకు వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో గ్రామపంచాయతీ స్థాయిలో ప్రతి వారం సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహిస్తూ జ్వరాల సర్వేలు, మెడికల్ క్యాంపులు, ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. జ్వరాల అనుమానిత నమూనాలను టి-హబ్‌కు ఆలస్యం లేకుండా పంపించాలని, మెడికల్ క్యాంపుల వివరాలను ముందుగానే జిల్లా కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీటి వనరుల సంరక్షణ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పాముకాటు, కుక్కకాటు చికిత్సకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, సిబ్బంది సెలవులు ముందస్తు అనుమతితోనే తీసుకోవాలని స్పష్టం చేశారు. గర్భిణుల ఆరోగ్య పరీక్షలు, అభా కార్డుల నమోదును పెంచడంతో పాటు ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపుల్లో స్క్రీనింగ్ చేసిన వారిని తిరిగి రీ-స్క్రీనింగ్ చేసి ఫాలోఅప్ నిర్వహించాలని సూచించారు. అలాగే 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. తనిఖీల్లో డా. సంతోష్ కుమార్, డా. వరుణ్, డా. బేయా బానీ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్‌తో పాటు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో తొలిసారి మానస దేవి ఆషాడ మాసం బోనాల జాతర

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణుకుంట్ల ప్రవీణ్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 11**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కాల్ టెక్స్ ఏరియాలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో తొలిసారిగా మానస దేవి ఆషాడ మాసం బోనాల జాతరను 12వ 13వ వార్డుల కౌన్సిలర్లు రాజ్ కుమార్ తిరుమల వాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు వార్డుల ప్రజలు బోనాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గం ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా అష్టైశ్వర్యాలతో ఉండాలని అమ్మవారికీ మొక్కులు చెల్లించారు అక్కడికొచ్చిన చిన్నారులను కళాకారులను అభినందించారు.

## కుటుంబాల వ్యాపారం 138 లక్షల కోట్లకు

### రోజుకు రూ.4 వేల కోట్లకు పైగా పెరిగిన బిజినెస్



దేశవ్యాప్తంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న కుటుంబాల సంపద జెట్‌స్పీడ్ వేగంతో దూసుకు పోతున్నది. దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీ.. భారతదేశంలో అత్యంత ధనిక వ్యాపార కుటుంబాల్లో తొలిస్థానంలో నిలిచారు. 2026లో దేశీయ సంపద 8.5 శాతం తగ్గి రూ.25.8 లక్షల కోట్లకు పడిపోయినప్పటికీ, దేశంలో అత్యంత సంపన్న వ్యాపార కుటుంబంగా ముకేశ్ అంబానీ తమ స్థానాన్ని నిలబెట్టుకున్నట్టు హురున్ ఇండియా 2026 ఏడాదికిగాను విడుదల చేసిన బార్‌క్లేవ్స్ ప్రైవేట్ క్లయింట్ హురున్ ఇండియా జాబితాలో చోటు దక్కించుకున్నది. ఈ జాబితాలో రూ.19.6 లక్షల కోట్ల సంపదతో గౌతమ్ అదానీ రెండో స్థానంలో నిలిచారు. రూ.12.1 లక్షల కోట్ల సంపదతో టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ ప్రమోటర్ సునీల్ భారతీ మిట్టల్ కుటుంబం ఈ జాబితాలో మూడో స్థానం దక్కించుకోగా, రూ.8.14 లక్షల కోట్లతో కుమార్ మంగళం బిర్లా ఆ తర్వాత స్థానం దక్కించుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కుటుంబ సభ్యుల వ్యాపారం మొత్తం విలువ 1.46 లక్షల కోట్లు లేదా రూ.138 లక్షల కోట్లుగా నమోదైందన్నారు. నెదర్లాండ్స్, సౌదీ, స్విట్జర్లాండ్, పోలాండ్ దేశ ఆర్థిక వ్యవస్థ కంటే అధికం. దేశీయ టాప్-300 కుటుంబ సభ్యుల వ్యాపారాలు గడిచిన రెండేండ్లలో రోజుకూ రూ.4,076 కోట్లు జమవుతున్నాయని తెలిపింది.

## 17 నుంచి లలిత జ్యువెల్లరీ ఐపీవో

లలిత జ్యువెల్లరీ..స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నుంచి అధికారిక అనుమతి పత్రం పొందిన సంస్థ..వచ్చే వారంలో ఐపీవోకి రాబోతున్నట్టు ప్రకటించింది. ఈ నెల 17 నుంచి మూడు రోజులపాటు(ఈ నెల 19వరకు) విక్రయించనున్న షేర్లతో రూ.1,700 కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. షేరు ధరల శ్రేణిని రూ.190-201 శ్రేణిలో నిర్ణయించింది. తాజా షేర్లను జారీ చేయడం ద్వారా రూ.1,200 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో షేర్లను విక్రయించడంతో మరో రూ.500 కోట్ల నిధులను సేకరించాలని యోచిస్తున్నది.

# మంథని మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్.. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంథని, ఆగస్టు-11 (ప్రజాతీర్పు)**

మంథని మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీ కె.ఎన్. జయ ప్రకాశ్‌పై వచ్చిన ఆర్థిక ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ నెల 7న మంథని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు శ్రీ కె.ఎన్. జయ ప్రకాశ్ పై పలు ఆర్థిక ఆరోపణలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి ప్రాథమికంగా విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, విధుల పట్ల అంకితభావం లోపించడం, ప్రభుత్వ ఉద్యోగికి తగని ప్రవర్తన వంటి అంశాలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర



సివిల్ సర్వీసెస్ ప్రవర్తనా నిబంధనలు, 1964లోని రూల్ 3(1), 3(2) నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్ రూల్స్, 1991లోని రూల్ 20 ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ సిసిఏ రూల్స్, 1991లోని రూల్ 8(1) ప్రకారం శ్రీ కె.ఎన్. జయ ప్రకాశ్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనల ప్రకారం సస్పెన్షన్ కాలంలో జీవనాధార భత్యంతో పాటు డి.ఏ. మరియు ఇతర పరిహార భత్యాలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.



## కురవి టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా ఏకగ్రీవ ఎన్నిక

**కురవి ఆగస్టు 11(ప్రజా తీర్పు విలేఖరి)**

కురవి టౌన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ స్థాయి పార్టీ కార్యకర్తలు సమావేశంలో ఇప్పటి వరకు గ్రామ శాఖ అధ్యక్షులు గా కొనసాగుతున్న నారాయణ రాజేందర్ ని కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.కురవి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు,కార్యదర్శులు పదవులతో పాటు మరియు యూత్ అధ్యక్షుల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.డోర్నకల్ శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ డాక్టర్.రామచంద్రు నాయక్ ఆదేశాల మేరకు,కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ కమిటి ఎన్నికలు నిర్వహించడం జరిగింది.గ్రామ కమిటీ అధ్యక్షులు గా సీనియర్ నాయకులు నారాయణ రాజేందర్ కుమార్ ను,ఉపాధ్యక్షులు గా బాదే వీరభద్రం,ప్రధాన కార్యదర్శి గా మండల రామచంద్రు,కార్యదర్శిగా బానోతు లక్ష్మణ్ నాయక్,ముఖ్య సలహా దారుడు గా బెడద వీరన్న ను,గ్రామ యూత్ అధ్యక్షుడిగా కొత్త యాకరాజు,బీసీ సెల్ అధ్యక్షులు గా తరాల వీరన్న ను,ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మూకరి వెంకన్న లను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్,కురవి మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్.దడిగల శరత్ కుమార్, మాజీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అవిరె మోహన్ రావు,కురవి ఉప సర్పంచ్ ఎర్ర నాగేశ్వరరావు,కురవి గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలపై స్పష్టత అవసరం.. విదేశీ నిధుల వినియోగంపై పారదర్శకత ఉండాలి

**మంథని, ఆగస్టు-11 (ప్రజాతీర్పు)**



విదేశాల నుంచి వచ్చే నిధుల వినియోగంపై పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిన అవసరం ఉందని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండపాక సత్యప్రకాష్ అన్నారు. విదేశీ విరాళాల నియంత్రణకు సంబంధించిన ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలపై ప్రజలు, విద్యావేత్తలు, మేధావులు వాస్తవాలను తెలుసుకుని చర్చించాలని కోరారు. మంగళవారం మంథనిలో విలేకరులతో మాట్లాడుతూ.. విదేశాల నుంచి వివిధ సంస్థలకు వచ్చే విరాళాలను ఏ ప్రయోజనం కోసం స్వీకరించారో, వాటిని ఏ కార్యక్రమాలకు ఖర్చు చేశారో ప్రభుత్వానికి లెక్కలు సమర్పించడం చట్టపరమైన బాధ్యత అన్నారు. పేదలు, విద్యార్థులు, విద్యాసంస్థలు, అనాథాశ్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల పేరుతో వచ్చే విదేశీ నిధులు నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగిస్తున్నారా అనే అంశంపై సమగ్ర పరిశీలన అవసరమని పేర్కొన్నారు. విదేశీ నిధుల దుర్వినియోగం జరుగుతోందనే ఆరోపణలు ఉన్న సందర్భాల్లో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ముఖ్యంగా మతమార్పిడులకు విదేశీ నిధులు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై చట్టబద్ధంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అయితే ఏ మతానికి లేదా వర్గానికి చెందిన సంస్థలపైనా సాధారణీకరణ చేయకుండా, నిధుల వినియోగంపై చట్టబద్ధమైన ఆడిట్, పారదర్శక విచారణ, ఆధారాల ఆధారంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎఫ్‌సీఆర్ఏపై జరుగుతున్న చర్చను రాజకీయ కోణంలో కాకుండా దేశ ప్రయోజనాలు, పారదర్శకత, సామాజిక సంక్షేమం కోణంలో చూడాలని కోరారు. విద్యావేత్తలు, మేధావులు, యువత ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలను పూర్తిగా తెలుసుకుని ప్రభుత్వానికి సహకరించాలని సత్యప్రకాష్ పిలుపునిచ్చారు. దేశంలో విదేశీ నిధుల ప్రవాహం, వాటి వినియోగంపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండటం ప్రజాస్వామ్యానికి, జవాబు దారీతనానికి అవసరమన్నారు.



## ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి..

### బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు

**అక్కన్నపేట ఆగస్టు 10 రవీందర్ ప్రజాతీర్పు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను చైతన్యపరచాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి మాచర్ల కుమారస్వామి పిలుపునిచ్చారు. సోమవారం అక్కన్నపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ మండల కార్యవర్గ సమావేశం, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ జాతీయ జెండాలను పంపిణీ చేసి జాతీయ స్ఫూర్తిని నింపాలని కార్యకర్తలకు సూచించారు. అక్కన్నపేట మండలంలో సర్ ప్రక్రియ దాదాపు 100 శాతం పూర్తయిందని, మిగిలిన ఫారాలను బి ఎల్ ఓ లతో మాట్లాడి పూర్తి చేయించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ చేరుకుని ప్రజలతో సంబంధాలు పెంచుకోవాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు నునావత్ మోహన్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, ఉపాధ్యక్షులు అర్జున్ నాయక్, సాంకే సంతోష్, కార్యదర్శులు వేముల ప్రసాద్, జన్నారపు కళ్యాణ్ విష్ణు, లావుడ్య రైనా నాయక్, వివిధ మోర్చాల అధ్యక్షులు ఇరుగుదినుల రాజకుమార్, మాలోత్ రాజునాయక్, గేరుమల రాజు, గంగుల కుమార్, బీజేవైఎం అధ్యక్షుడు సలేంద్ర తిరుపతి, సోషల్ మీడియా కన్వీనర్ జంగపల్లి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పాఠశాల ఆవరణలో బీర్ బాటిల్ కలకలం

**మహమ్మద్ నగర్ / ఆగస్టు 11 ( ప్రజా తీర్పు ):**

మహమ్మద్‌నగర్ మండలం, సింగీతం: గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బీర్ బాటిల్ కనిపించడం కలకలం రేపింది. పాఠశాల ప్రాంగణంలో మద్యం బాటిల్ ఉండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా,సురక్షితంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 11**

జిల్లాలో నెల 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గౌరవ వందనం, మంచిర్యాల,నస్పూర్ మండలాల తహసిల్దార్ల సంయుక్త ఆధ్వర్యంలో కుర్చీలు, ఇతర ఏర్పాట్లు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథి సందేశం,



జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, పుష్పగుచ్ఛాలు, వేదిక తయారీ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని, వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, మంచిర్యాల ఎసిపి ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమర సన్నాహం.. కొలంబోలో 6 రోజుల పాటు భారత్ ముమ్మర ప్రాక్టీస్

## క్లీన్‌స్వీప్ లక్ష్యంగా అస్త్రాలకు పదును






శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్ మునుపెన్నడూ లేని విధంగా సన్నద్ధం అవుతోంది. ఈనెల 4న కొలంబోలో అడుగుపెట్టడం మొదలు అక్కడి నాన్‌డెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) మైదానంలో వరుసగా ఆరు రోజుల పాటు ఎలాంటి విరామం లేకుండా చెమటలు చిందించింది. ఇందులో మూడు రోజుల పాటు సాగిన పూర్తి స్థాయి వామప్ మ్యాచ్‌తో పాటు, మిగిలిన రోజుల్లో రోజుకు ఐదు నుంచి ఆరు గంటల పాటు సాగిన కఠిన నెట్ సెషన్లు ఉన్నాయి. గిల్‌సేన ఇంత ముమ్మరంగా సాధన చేయడం వెనుక రెండు కారణాలున్నాయి. ఒకటి 18 ఏండ్ల నుంచి లంకపై ఒక్క టెస్టు సిరీస్ కోల్పోని రికార్డును కొనసాగించడం..రెండోది ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం ఉండటం. దాంతో ఈనెల 15న మొదలయ్యే సిరీస్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ఏ చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా పక్కా ప్రణాళికతో ఆటగాళ్లను సిద్ధం చేస్తోంది.

### ఓవైపు వామప్.. ఇంకోవైపు నెట్ సెషన్

ప్రస్తుత జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే లంకలో టెస్టు మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. మిగిలిన ఆటగాళ్లందరికీ ఇక్కడి పరిస్థితులు కొత్త. అందుకే లంకలో అడుగుపెట్టిన 24 గంటల్లోనే మైదానంలోకి దిగిన జట్టు ఇక్కడి విపరీతమైన వేడి, తీవ్రమైన తేమతో కూడిన వాతావరణానికి ఆటగాళ్లు అలవాటుపడేలా హెడ్ కోచ్ గంభీర్ ప్రాక్టీస్ సెషన్స్‌ను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తిరిగి 2 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా విభజించాడు. లంక ఎలెవన్‌తో జరిగిన వామప్ మ్యాచ్ సమయంలోనూ ఫీల్డింగ్ చేస్తున్న ఆటగాళ్లను మారుస్తూ, ఒకవైపు మ్యాచ్ ఆడుతూనే మరోవైపు సమాంతరంగా నెట్స్ ప్రాక్టీస్ చేయించడం గమనార్హం. ఎన్‌సీసీ మైదానంలో జరిగిన శిక్షణ ఎంత తీవ్రంగా సాగిందంటే, ప్రాక్టీస్ సెషన్ అని చూడకుండా ఫాస్ట్ బౌలర్లు నెట్స్‌లో పూర్తి వేగంతో విరుచుకుపడ్డారు. పంజాబ్ పేసర్ గుర్నూర్ బ్రార్ విసిరిన ఓ బంతి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కుడి చేతి వేలుకు బలంగా తాకి గాయపరిచింది. ముందు జాగ్రత్తగా వామప్ మ్యాచ్ రెండు రోజుల ఆటకు దూరంగా ఉన్న గిల్ ఆఖరి రోజున ఓపెనర్‌గా బరిలోకి దిగి మెరుపు ఇన్నింగ్స్ ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు.

### పగుళ్ల పిచ్‌పై స్పిన్నర్లను ఎదుర్కొంటూ..

మూడు రోజుల వామప్ మ్యాచ్ ముగిసిన తర్వాత సోమవారం జట్టుకు విశ్రాంతి ఇస్తారని భావించినప్పటికీ, ప్రధాన పేసర్లను మినహాయించి మిగిలిన ఆటగాళ్లంతా ఎన్‌సీసీ మైదానంలో మళ్లీ మూడు గంటలకు పైగా చెమటోడ్చారు. టెస్టు మ్యాచ్‌లో నాలుగో రోజు నాటి పిచ్‌ను తలపించేలా పగుళ్లు ఉండి, స్పిన్, రివర్స్ స్వింగ్‌కు అనుకూలించేలా వికెట్‌ను తయారు చేయించుకొని మరీ దీనిపై జట్టులోని నలుగురు స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్ బౌలింగ్‌లో బ్యాటర్లు తమ డిఫెన్స్, ఫుట్‌వర్క్‌ను మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించారు. సీనియర్ బ్యాటర్ రాహుల్ స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లపై సాధన చేశాడు. గతంలో ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల్లో పరిస్థితులకు వేగంగా అలవాటు పడకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని పునరావృతం కాకుండా చూడాలనే కసి జట్టులో స్పష్టంగా కనిపిస్తోంది. కొలంబోలో ఆరు రోజులు ఉన్న గిల్‌సేన తొలి టెస్టు కోసం మంగళవారం గాలెకు చేరుకుంది. బుధవారం ఒక్క రోజు విశ్రాంతి తీసుకొని గురువారం నుంచి మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టి గాలె టెస్టులో ఆడే తుది జట్టుపై ఓ అంచనాకు రానుంది.

### రివర్స్ స్వింగ్ కోసం గిల్ ప్రత్యేక సాధన

లంక పిచ్‌లపై ప్రధాన సవాలుగా మారే రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేందుకు గిల్ ప్రత్యేక ప్రణాళికను అమలు చేశాడు. టీమ్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా తెప్పించిన కూకబురా రెడ్ బాల్స్‌లో కొద్దిగా పాతబడ్డ (సెమీ ఓల్డ్) బంతులతో ప్రాక్టీస్ చేశాడు. త్రో-డౌన్ స్పెషలిస్టులతో పాటు పేసర్ ఆకిబ్ నబీ బౌలింగ్‌లో రివర్స్ స్వింగ్ అవుతున్న బంతులను దాదాపు 20 నిమిషాల పాటు ఎదుర్కొన్నాడు. శ్రీలంకలోని పొడి వాతావరణం, రఫ్ ఔట్‌ఫీల్డ్ వల్ల బంతి త్వరగా మెరుపు కోల్పోయి రివర్స్ స్వింగ్‌కు అనుకూలిస్తుంది.

# జిమ్‌క్విన్ ఓవరాల్ చాంప్ గాడియం స్కూల్




అఖిల భారత జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్-జిమ్‌క్విన్‌లో హైదరాబాద్‌కు చెందిన ది గాడియం స్కూల్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. గాడియం స్కూల్ వేదికగా మూడు రోజుల పాటు జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో 15 రాష్ట్రాల నుంచి 1200 మందికి పైగా వర్ధమాన జిమ్నాస్ట్‌లు పాల్గొన్నారు. ఆతిథ్య గాడియం 174 స్వర్ణాలు, 158 రజతాలు, 140 కాంస్యాలతో మొత్తం 472 పతకాలు కైవసం చేసుకుంది. హైఫ్లయర్స్ జిమ్నాస్టిక్స్ అకాడమీ 72 స్వర్ణాలు సహా మొత్తం 246 పతకాలు గెలిచి రన్నరప్‌గా నిలిచింది.

# టీటీ విన్నర్ రిద్ధి



సీబీఎస్ఈ క్లస్టర్-7 టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన యంగ్ ప్యాడ్లర్ రిద్ధి తోరో సత్తా చాటింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో జరిగిన ఈ టోర్నీ అండర్-14 బాలికల సింగిల్స్ విభాగంలో చాంపియన్‌గా నిలిచింది. బండ్లగూడ జాగీర్‌లోని టైమ్స్ స్కూల్ కు చెందిన రిద్ధి ఫైనల్లో 3-1 (7-11, 11-9, 11-8, 11-5) తో విజయవాడ ప్యాడ్లర్ హేత్వికపై విజయం సాధించింది. బా లికల అండర్-14 టీమ్ ఈవెంట్‌లో రిద్ధి తోరో, వంశిక, అనన్యతో కూడిన టైమ్స్ స్కూల్ రన్నరప్‌గా నిలిచింది.



# ప్రజ్ఞానంద తొలి గేమ్ డ్రా


సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా అమెరికాలో జరుగుతున్న సింక్‌ఫీల్డ్ కప్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద తొలి గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ఫస్ట్ రౌండ్‌లో నల్లపావులతో ఆడుతూ అమెరికా జీఎం సామ్ సేవియన్‌తో తలపడ్డ ప్రజ్ఞా.. 48 ఎత్తుల తర్వాత గేమ్‌ను డ్రాగా ముగించాడు. అమెరికా ఆటగాడు ఫాబియానో కరువానా.. జోర్డాన్ వాన్ (నెదర్లాండ్స్)ను ఓడించడం మినహా మిగిలిన ప్లేయర్లంతా తొలి గేమ్‌ను డ్రాతోనే సరిపెట్టుకున్నారు.

# కోహ్లీ ఫీల్డింగ్‌లో రాజీపడడు

## మాజీ ఫీల్డింగ్ కోచ్ దిలీప్



టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ ఫీల్డింగ్ విషయంలో రాజీపడని తత్వంతో జట్టులోని ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తాడని మాజీ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ అన్నాడు. ఐదేండ్ల పాటు జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించిన అతడు ఇటీవలే తన బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దిలీప్ మాట్లాడుతూ.. 'కోహ్లీ విషయానికొస్తే ఫీల్డింగ్‌లో అతడు రాజీపడడు. పవర్ ప్లేలో కవర్స్, షార్ట్ మిడ్ వికెట్ వద్ద ఎంత ఇంటెన్సిటీతో ఫీల్డింగ్ చేస్తాడో ఈ వయసులోనూ డెత్ ఓవర్స్‌లో లాంగాన్, లాంగాఫ్ వద్ద అంతే తీవ్రతతో ఉంటాడు. బంతి తన వద్దకు రాకపోయినా అతడి ప్రయత్నం మాత్రం ఆగదు. బ్యాటర్‌ను రనౌట్ చేయాల్సి వస్తే అతడే ముందుంటాడు. ప్రాక్టీస్ సెషన్స్‌తో పాటు మ్యాచ్‌ల్లోనూ కోహ్లీ ఫీల్డింగ్‌లో తేడా ఉండదు. విరాట్‌ను స్ఫూర్తిగా తీసుకుని జట్టులో తమ శక్తికి మించి రాణించిన ఆటగాళ్లు ఉన్నారు' అని చెప్పుకొచ్చాడు.



# యశ్ 'టాక్సిక్' సినిమాను రిజెక్ట్ చేసిన స్టార్ హీరో ఎవరో తెలుసా? గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకున్నాడా?

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటించి టాక్సిక్ సినిమాపై అంచనాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ ను చూసి అభిమానులు వెర్రెక్కిపోతున్నారు. టీజర్స్, ట్రైలర్సే ఇలా ఉంటే మొత్తం సినిమా ఎలా ఉంటుందోనంటూ ఫ్యాన్స్ లెక్కలు వేసుకుంటున్నారు. యశ్ 'టాక్సిక్' సినిమాను రిజెక్ట్ చేసిన స్టార్ హీరో ఎవరో తెలుసా? గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకున్నాడా? కేజీఎఫ్ 2 తర్వాత లాంగ్ గ్యాప్ తీసుకున్న రాకింగ్ స్టార్ యశ్ ఇప్పుడు టాక్సిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఇప్పటికే పలు సార్లు వాయిదా పడుతూ వస్తోన్న ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ఆగస్టు 26న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్ లోనూ ఈ సినిమా రిలీజ్ కానుండడం విశేషం. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఏకంగా ఐదు గురు హీరోయిన్లు నటిస్తున్నారు. నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ యశ్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్లు, పాటలు, ట్రైలర్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. దీనికి తోడు యశ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తుండడంతో ఈ మూవీపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ఇదిలా ఉంటే టాక్సిక్ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికర విషయం ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది.

# 25 ఏళ్ల ఎదురుచూపులకు తెర.. రంభ, ఊర్వశి, మేనకలు దిగొస్తే, టీజర్ అదుర్స్!

టాలీవుడ్‌లో కామెడీకి తనదైన శైలిని జోడిస్తూ సినిమాలు చేస్తున్న అల్లరి నరేష్ మరో ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా, సురభి హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. హాస్య మూవీస్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్లపై రాజేష్ దండా, ప్రసాద్ నిమ్మకాయల నిర్మిస్తున్న ఈ సినిమాకు చంద్ర మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే టైటిల్‌తోనే ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచిన ఈ సినిమా సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్స్‌ను జోరుగా ప్రారంభించింది. ఇందులో భాగంగా తాజాగా సినిమా టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ చూస్తుంటే పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించినట్లు స్పష్టమవుతోంది. 'రంభ ఊర్వశి మేనక' కథలో ఆసక్తికరమైన ఫాంటసీ ఎలిమెంట్‌ను జోడించినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. హీరోకు చిన్నతనంలో ఓ ప్రత్యేకమైన పుస్తకం దొరుకుతుంది. అందులో సూచించిన విధంగా ముగ్గు వేసి, రంభ, ఊర్వశి, మేనకలను పూజిస్తే వారు భూలోకానికి వచ్చి కోరుకున్న కోరికలను నెరవేరుస్తారనే విషయం అతడికి తెలుస్తుంది. అప్పటి నుంచి హీరో ఏకంగా పాతికేళ్ల పాటు రంభ, ఊర్వశి, మేనకల కోసం ఎదురుచూస్తూ పూజలు చేస్తుంటాడు. ఎట్టకేలకు అతడి నిరీక్షణ ఫలించి ఆ ముగ్గురు అప్సరసలు భూలోకానికి దిగివస్తారు. ఆ తర్వాత హీరో జీవితంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? అతడి కోరికలు నెరవేరాయా? లేక ముగ్గురు అప్సరసల రాకతో అతడి జీవితమే తలకిందులైందా? అనేది సినిమాలో ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు టీజర్ తెలియజేస్తుంది. ఈ సినిమాలో రంభ పాత్రలో రాశి సింగ్, ఊర్వశిగా విష్ణుప్రియ, మేనకగా ప్రిషా సింగ్ కనిపించనున్నారు. ఇక దేవేంద్రుడి పాత్రలో వెన్నెల కిషోర్ నటిస్తున్నారు. టీజర్‌లో వెన్నెల కిషోర్ కనిపించిన తీరు కూడా కామెడీకి మరింత బలం చేకూర్చేలా ఉంది. అల్లరి నరేష్ కామెడీ టైమింగ్‌కు ఫాంటసీ కథను జోడించడం సినిమాకు ప్రధాన ఆకర్షణగా మారే అవకాశముంది.







Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020